




# Crime News ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, జూన్ 19, 2026 | సంపుటి - 20 | సంచిక 266 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## వానాకాలం సాగుకు రైతులకు

# అండగా ప్రభుత్వం

## 30న రైతు భరోసా నిధులు విడుదల

### మధిర వేదికగా సీఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత

- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

**ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది.**



హైదరాబాద్ : 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం

తరువాయి 2లో




## నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

**వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి**

**మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి**

**వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం**

హైదరాబాద్ : రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు.

తరువాయి 2లో

## నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు




2

- వందతులను నమ్మొద్దని విద్యార్థులకు వినతి
- 21న రీ టెస్టు కోసం ఏర్పాట్లు పూర్తి: ఎన్‌టిఎ




## కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్

**నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్**

**కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు**

**ఢిల్లీ హైకోర్టుకు నివేదిక సమర్పణ**

న్యూఢిల్లీ : మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది.

తరువాయి 2లో



## ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

**పేదల జోలికి వెళ్లకుండా..కబ్జాదారుల భరతం పడుతోంది**

**హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం**

**ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది**

**మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం**

**గుర్రంగూడ ఎకో పార్క్‌లో ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి**

రంగారెడ్డి : ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరి ంచారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతు న్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

తరువాయి 2లో

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

### 11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం

### జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం



హైదరాబాద్ : తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్ కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచిం చారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు.

2లో



## పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యం

### ఇప్పటికే 15.54 లక్షల ఇళ్ల మంజూరు

### మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడి

అమరావతి : కూటమి ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 15.54 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.సీఎం చంద్రబాబు ఎప్పుడూ పేదల గృహ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు.

2లో



## ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి

- కిలో ధర 4 వరకు తగ్గించిన వ్యాపారులు
- సీఎంతో ఆక్వా ఫీడ్ వ్యాపారుల భేటీ
- ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై చంద్రబాబు సమీక్ష

అమరావతి : ఆక్వా ఫీడ్ ధర తగ్గించాలని తయారీదారులను సీఎం చంద్రబాబు నాయుడు కోరడంతో వారు సానుకూలంగా స్పంది ంచారు. దీంతో ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిర్దేశిర చడంతో ఆక్వా ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు తయారీదారులు అంగీకరించారు. దీంతో కేజీ ప్రస్తుతం రూ.112 నుంచి రూ.108కి ఫీడ్ ధరలు తగ్గనున్నాయి. ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై గురువారం

తరువాయి 2లో

## ప్రైవేట్ స్కూల్ ఫీజులను డిస్‌ప్లే చేయాలి

**పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరి ప్రదర్శించాలి**

**అనాథ పిల్లలకు కూడా తల్లికి వందనం అమలు**

**విద్యాశ్శాఖ అధికారలుతో సమీక్షలో మంత్రి లోకేశ్**



అమరావతి : ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసర నిబంధనలు తొలగించాలని విద్యా,ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను బోర్డులపై, పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం ప్రయోజనాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. గార్డియన్లు లేని పిల్లలకు జిల్లా కలెక్టర్ ద్వారా నిధుల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాల్లో

తరువాయి 2లో

# ఆధార్ కార్డు ఐడెంటిటీకి మాత్రమే పరిమితం చేయాలి

జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసం, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్ ను విచారించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్ గా మాత్రమే వాడాలని పౌరసత్వం, నివాసం, అడ్రస్, పుట్టిన తేదీకి సంబంధించిన రుజువుగా వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర, ఎన్నికల సంఘాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్. ఓటరు నమోదుకు బర్త్ డేట్, రెసిడెంట్ ప్రూఫ్ లకు ఆధార్ కార్డును వినియోగిస్తున్నారని, ఇది ఆధార చట్టానికి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 'ఆధార్ పౌరసత్వానికి లేదా రెసిడెంట్ కు ప్రూఫ్ కాదని స్పష్టంగా తెలిపింది ఉడాయ్. అయినప్పటికీ, ఆధార్‌ను స్కూల్ అడ్మిషన్లు,ప్రాపర్టీ కొనుగోలు, బర్త్ ప్రూఫ్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం వయస్సు, పౌరసత్వం, నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించడమే కాకుండా, కొత్త ఓటరు నమోదుకు, పుట్టిన తేదీకి, నివాస ధృవీకరణ పత్రంగా కూడా వాడుతున్నారు. ఈ విధంగా, చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ డాక్యుమెంట్లను పొందుతున్నారని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలలో ధృవీకరణ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాలని, సంస్కరణలను పర్యవేక్షించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

# నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

న్యూఢిల్లీ : నీట్-యూజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ఎన్‌టిఎ తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చని ఎన్‌టీఏ సూచించింది.పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్-యూజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు.హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# టవానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ- జీ ఆర్ఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

ఎస్పీ బండి శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలంలో కిరాణా దుకాణం నిర్వహించే జాట్ రోహిత్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండ కొత్తపల్లికి చెందిన మధు.. టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తుండగా.. తెల్లవారుజామున జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సమీపంలోకి రాగానే ట్రక్కు టైరు పంక్చర్ అయింది. అదే దారిలో వెళ్తున్న లారీని ఆపి జాకీ తీసుకున్నారు. లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు డ్రైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్.. పంక్చర్ అయిన టైరును మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి-మురహరిపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అతి వేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కారులో నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. వికారాబాద్‌జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్‌పాషా (30) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు, డీసీఎం వ్యాన్ సిరిసిల్ల బైపాస్‌పై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిది జగిత్యాలగా తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి

అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులతో ఆయన సమావేశమయ్యారు. ధరల స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులతో కమిటీ వేయాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. 20 రోజుల్లో ఈ కమిటీ నివేదిక ఇవ్వాలని వారికి స్పష్టం చేశారు. అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు, ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులు పాల్గొన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇవ్వడంపై ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వా సాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతోందని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరు సార్లు పెంచారని గుర్తు చేశారు. అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై చొరవ తీసుకోలేదని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దృష్టికి ఆక్వా రైతులు తీసుకెళ్లారు. తాము ఎప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించ లేదని.. ఇటీవల కొందరు రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంకు ఆక్వా రైతులు వివరించారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయే నాటికి అది రూ.107.80కి చేరిందని సీఎం చంద్రబాబుకు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందని రైతులు గుర్తు చేశారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకుని మరింత లాభాలు పొందేలా చర్యలు చేపట్టాలని రైతులకు సీఎం సూచించారు. లక్షలాది మంది ఆధారపడిన ఆక్వా రంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో పొగాకు, మామిడి, ఆక్వా ధరలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పొగాకు మార్కెట్ పరిస్థితులపై, సంబంధిత రైతుల సమస్యలు, ధరల స్థిరీకరణపై చర్చించారు సీఎం. పొగాకు బోర్డు ప్రతినిధులతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం నిర్వహించారు. మామిడి రైతుల సమస్యలు, మార్కెటింగ్ అవకాశాలపై సమీక్షించారు. మామిడి దిగుబడులు, ధరల పరిస్థితులపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు ఓ నివేదిక అందజేశారు. అదే విధంగా ఆక్వా రంగంలో ధరల హెచ్చుతగ్గులపైనా చర్చించారు సీఎం. రొయ్యలు, చేపల రైతుల సమస్యలపై ఈ సమీక్ష సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రొయ్యల ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులతోనూ ఆయన భేటీ అయ్యారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, హ్యాచరీల ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయం, ఉద్యానవన, మత్స్యశాఖల ఉన్నతాధికారులతో ఈ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

# పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యం

అదే విధానాన్ని ఇప్పుడు మరింత వేగంగా అమలు చేస్తున్నామని వివరించారు. రెండేళ్ల గృహనిర్మాణ శాఖ ప్రగతిపై మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో గృహ నిర్మాణానికి అవసరమైన నిధులు సరైన స్థాయిలో విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. వివిధ దశల్లో ఉన్న దాదాపు 4 లక్షల ఇళ్ల ప్రాజెక్టులు రద్దు చేశారని ప్రస్తావించారు. జగన్ హయాంలో నిలిపివేసిన గృహ నిర్మాణాలను తిరిగి ప్రారంభించి, ఇప్పటికే 4.50 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలు అందించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. అదేవిధంగా మిగిలిన 4.14 లక్షల ఇళ్లను కూడా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు. గృహ నిర్మాణ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి దాన్ని రెండేళ్లు పొడిగించినట్లు స్పష్టం చేశారు. జగన్ హయాంలో పేదల ఇళ్ల కోసం సరైన నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. దాదాపు ఆరు లక్షల ఇళ్లకు కేవలం రూ.15 వేలే సహాయం ఇచ్చినట్లు తెలిపారు. 2014 నుంచి 2019 కాలంలో రాష్ట్ర వాటా రూ.50 వేలుగా ఉండగా, హుద్‌హుద్ తుఫాన్ తర్వాత విపత్తు సహాయంగా దాతల ద్వారా రూ.2 లక్షల వరకు నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. అర్బన్ హౌసింగ్ యూనిట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రాంతాలను రూరల్ కేటగిరీగా పరిగణించిందని తెలిపారు. అయితే తుడా, సీఆర్డీఏ వంటి ప్రాంతాల్లో అర్బన్ హౌసింగ్ అమలుకు అంగీకారం లభించిందని మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేని లబ్దిదారులను గుర్తించి ఎస్సీ, ఎస్టీలకు అదనపు నిధులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అదే విధంగా బీసీలకు కూడా అదనపు ఫండింగ్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సుమారు 15 లక్షల ఇళ్ల మంజూరులో కనీసం 9 లక్షల ఇళ్లు ఎందుకు పూర్తికాలేదని సీఎం అడిగారని చెప్పారు. ఈ లోటును పూడ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

# కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్

సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు దిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ఎ÷-లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది. హ్యాకర్ గ్రూప్‌లు కూడా ఈ టెలిగ్రామ్ ఛానళ్లను ఉపయోగించి పెద్ద ఎత్తున డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. అంతేగాక, యూజర్ల వ్యక్తిగత డేటా అయిన మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఇతర సున్నితర సమాచారాన్ని యాక్సెస్ చేసేలా టెలిగ్రామ్ బాట్స్ పనిచేస్తుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది.

## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్‌ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ ఫీజులను డిస్‌ప్లే చేయాలి

నేరుగా నిధులు జమ చేసే విధానంపై ఆలోచన చేయాలన్నారు. ఇకపోతూ పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే నంబర్-1గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పీఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. గురువారం విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. మెగా పీటీఎం నాటికి విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. 430 కేజీబీవీల్లో 1.06 లక్షల మంది బాలికలకు బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2.03 లక్షల మంది విద్యార్థులకు కిట్ల పంపిణీ చేయాలన్నారు. తెలుగు అకాడమీ పుస్తకాలు త్వరలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని లోకేశ్ వెల్లడించారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయాలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి, పోలవరం ప్రాంతాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల హాజరు 95 శాతానికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో, పారదర్శకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మ్యాథ్స్, సైన్స్, తెలుగులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మాతృభాష తెలుగును విస్మరించొద్దని ఉపాధ్యాయులకు మంత్రి సూచనలు చేశారు. బ్రిడ్జ్ కోర్సు మెటీరియల్ సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులకు క్రోమ్ బుక్స్‌తో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు.

# రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

**అందులో 5 ఎకరాలు తమవేనంటూ ఎస్‌బిఐ పిటిషన్**

**కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు**

హైదరాబాద్,జూన్18 : హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి ఇటీవల వేలం నిర్వహించారు. ఈ స్థలాన్ని ఎకరాకు రూ.237కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక్ ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. సర్వే నెంబర్ 83/1లోని 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాయదుర్గం భూముల వేలంపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలోని పన్మక్తలో టీజీఐఐసీ జరిపిన భూముల వేలంపై ఇటీవల ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. ఇటీవల జరిగిన వేలంలో అక్కడ ఎకరం రూ.237 కోట్లు పలికిన సంగతి తెలిసందే. సర్వే నం.83/1లో ఐదు ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. మే 6న జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌తోపాటు తదనంతరం జరిగిన భూ విక్రయాన్ని, తమ వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ మే 20న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఎస్‌బీఐ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. రాయదుర్గంలో ఎస్‌బీహెచ్‌కు 2010లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఇందుకోసం రూ.13.33 కోట్లను చెల్లించింది. ఎస్‌బీఐలో ఎస్‌బీహెచ్ విలీనం కాగా, గతంలో ఈ స్థలంలో ఉన్న రెండు ఏటీఎంలను ఎస్‌బీఐ నిర్వహిస్తోంది. 2020లో గత ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయగా ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ.. ఎస్‌బీఐ అభ్యర్థనను పునఃపరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం 2024లో ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ కేటాయింపును రద్దు చేయడంతో ఎస్‌బీఐ మరోసారి హైకోర్టును ఆశ్రయించింది.

# నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్

### ఉద్యోగాల పేరుతో ఆశపెట్టి చేతులెత్తారు

### జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

వరంగల్,జూన్18 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి చే ప్రత్యేకంగా రూపొందించిన యాపస్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గండ్ర రమణా రెడ్డి చేతుల మీదుగా హన్మకొండలోని అంబేద్కర్ భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని శాఖల్లో కలిపి లక్షా 67 వేల ఉద్యోగాలు ఇచ్చింది. పరోక్షంగా ప్రయివేటు రంగంలో స్వాతంత్య భారత దేశంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు కల్పించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఉన్న ప్రయివేటు కంపెనీలు తరలి వెళ్లే పరిస్థితి వచ్చి ఎక్కడా ఉద్యోగ కల్పన జరగడకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రతి రెండేళ్లకోసారి పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక అనవాయితీగా ఉండేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 30 నెలల కావొస్తున్నా ఒక్క పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. విద్యారంగాన్ని సైతం నిర్వీర్యం చేసే కుట్ర సాగుతుంది. ఇప్పటి వరకు ఏ ఒక్క యూనివర్సిటీలో కూడా అధ్యాపక పోస్ట్ లు భర్తీ చేయడం లేదు. ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అని నోటికొచ్చిన హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ప్లేట్ పిరాయించారని మండిపడ్డారు. నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఉన్నత విద్యావంతుడు నిరుద్యోగ యువత సమస్యలు నిత్యం వారు పడే కష్టాలు చూసే వ్యక్తి కాబట్టి మీ అందరి కోసం యాప్ ను రూపొందించిన ఉచితంగా మీకు అందించడం నిజంగా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రొఫెసర్ తిర్నారి శేషు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, ప్రముఖ న్యూరో వైద్యులు నవీన్ ఉన్నారు.

# ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం ఆందోళన

### బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్ట్

సూర్యాపేట,జూన్18 : ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని, పాఠశాలల్లో కనీస వసతులు కల్పించలాని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా వేకువజాము నుంచే బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలిస్తున్నారు. బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ క్లలెట్లపల్లి శోభన్ బాబుతో పాటు విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి సూర్యాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తూ విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్ట్ లు చేస్తున్నారని శోభన్ బాబు మండిపడ్డారు. ప్రశ్నించినా, నిలదీసినా కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. కేసులకు, అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు నిరంతరం ప్రజల తరపున ప్రశ్నిస్తామన్నారు.

# మహిళా డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు

### 21వ తేదీలోపు దరఖాస్తుకు ఆహ్వానం

నల్లగొండ,జూన్18 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నల్లగొండ, డిగ్రీ మొదటి సంవత్సరం వివిధ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అడ్మిషన్లు కొనసాగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పవిత్ర వాణి కర్ష తెలిపారు. కళాశాలలో వివిధ కోర్సుల్లో విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వాస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 21వ తేదీ లోపు కళాశాలలో సంప్రదించాల్సిందిగా సూచించారు. ఆసక్తి గల ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు పదో తరగతి మెమో, ఇంటర్మీడియట్ మెమో, 2026 జనవరి తర్వాత పొందిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ జిరాక్స్, ఇంటర్మీడియట్ టీసీతో పాటుగా రెండు సెట్ల జిరాక్స్ కాపీస్ తో నేరుగా కళాశాలలో హాజరై అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10:00 నుండి సాయంత్రం 4 గంటల వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

# ధర్మపురిలో విషాద ఘటన

### కోతుల కొట్లాటతో రాయిపడి మహిళ మృతి

జగిత్యాల,జూన్18 : జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. కోతుల కొట్లాట ఓ మహిళ ప్రాణాన్ని బలి తీసుకుంది. మిద్దెపై కోతులు కొట్లాడుకుంటూ కింద ఉన్న మహిళ తలపై సిమెంట్ ఇటుక పడేశాయి. దీంతో ఆ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ధర్మపురిలోని కమలాపూర్ రోడ్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన కొనపర్తి సత్యనారాయణ, పద్మ భార్యాభర్తలు. బుధవారం సాయంత్రం పద్మ ఇంటి ముందు కూర్చుని మరో మహిళతో మాట్లాడుతోంది. అదే సమయంలో ఇంటి రేకులపై కోతులు తీవ్రంగా గొడవపడసాగాయి. ఈ నేపథ్యంలోనే రేకులు గాలికి ఎగిరిపోకుండా ఉండటానికి బరువు కోసం పెట్టిన సిమెంట్ ఇటుకను కిందకు పడేశాయి. ఆ ఇటుక నేరుగా పద్మ తలపై పడింది. తలకు తీవ్ర గాయం అవ్వటంతో పద్మ అక్కడికక్కడే చనిపోయింది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# అవినీతిపై ప్రశ్నిస్తే ఎదురుదాడులా?

### సమాధానం చెప్పకుండా తప్పించుకోలేరు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై కొప్పుల ఫైర్




కరీంనగర్ : ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఈ విషయాలపై సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లు మాయమయ్యాయన్న అంశం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగా ధైర్యం ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. మంత్రి పదవికి రాజీనామా చేయడం అంత సులభమైన విషయం కాదని, ఎన్నో కష్టాలు పడి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసే ధైర్యమే లేదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలపై సమాధానాలు చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. హరీశ్‌రావును 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ రాజకీయాలు చేస్తున్నావా? అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు.

# సాయికృష్ణ అదృశ్యం కేసు

### విచారణాధికారిగా రాజమండ్రి ఎస్పీ

విజయవాడ,జూన్18 : నగరంలో సంచలనం రేపుతున్న రౌడీషీటర్ సాయికృష్ణ అదృశ్యం కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణాధికారిగా రాజమండ్రి ఎస్పీ నరసింహ కిషోర్‌ను అధికారులు నియమించారు. కేసుపై వస్తున్న ఆరోపణలు, ప్రజల్లో నెలకొన్న అనుమానాల నేపథ్యంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సాయికృష్ణ అదృశ్యంపై ఇప్పటికే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణను అదుపులోకి తీసుకున్న అనంతరం కనిపించకుండా పోయాడని.. అతడ్ని స్టేషన్లో లాకప్ డెత్ చేశారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజమండ్రి ఎస్పీ నరసింహ కిషోర్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. గురువారం ఎస్పీ.. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. విచారణలో భాగంగా పలువురు పోలీసు సిబ్బందిని ప్రశ్నించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సాయికృష్ణ అదృశ్యంపై తల్లి విజయలక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. 'సాయికృష్ణ బతికి ఉన్నాడో లేదో' తెలిపాలని కోరుతున్నారు. అంతేకాకుండా సాయికృష్ణ మిస్సింగ్ కేసులో స్థానిక పోలీసుల దర్యాప్తుపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు జరిపించాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

## హర్మ్యూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

### ఇప్పట్లో తగ్గించే ఉద్దేశ్యం లేదన్న కేంద్రం

న్యూఢిల్లీ,జూన్18 : అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు దిగిరానున్నాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గినా.. భారత్‌లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది. పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ ఇటీవల ఇంధన ధరలు పెంచడంపై గురువారం మాట్లాడారు. లీటరుకు దాదాపు రూ.3.94 మాత్రమే పెంచామన్నారు. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన.. ఆ పెంపును వెంటనే తగ్గించలేమన్నారు. హర్మ్యూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ.. ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరకు లభించే ముడి చమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. ఇలా పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని స్పష్టంచేశారు. ఇక, పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలోని చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. ఆ సమయంలో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ రాష్ట్రం ముందుకు రాలేదన్నారు. దీంతో ఆ భారమంతా కేంద్రంపై పడిందన్నారు. దీని కారణంగా కేంద్రం రూ.12వేల కోట్ల మేర ఆదాయం కోల్పోయిందన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

### జర్నలిస్టులకు అవగాహన కార్యక్రమం

హైదరాబాద్,జూన్18 : జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులతో ప్రత్యేక అవగాహన మరియు పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు ఉదయం 11.00 గంటలకు మీడియా అకాడమీ ఆడిటోరియం, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దాని లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంటలకు ముగియనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు తమ పేర్లను 20వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటలలోపు వాట్సాప్ నంబర్ 7093600977 కు పంపి నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువులోపు తమ పేర్లను నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.

# పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు

### ఎంతటి వారైనా పార్టీకి కట్టుబడి ఉండాల్సిందే

### క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి

హైదరాబాద్,జూన్18 : ఎంతటి వారైనా సరే వారి వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్ద వద్దని నేతలకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే.. వాటిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేకుంటే రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని నేతలకు ఆయన సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరవుతారన్నారు. కామారెడ్డిలో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు. షబ్బీర్ ఆలీకి నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆదివారం కమిటీ ముందు హాజరు కావాలని ఆయనకు సూచించామన్నారు. అందుకు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముందుగా షబ్బీర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదుపై క్రమశిక్షణ కమిటీ చర్చిందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని మల్లు రవి వెల్లడించారు. పార్టీ వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించిన క్రమశిక్షణ కమిటీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని నేతలకు ఎంపీ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. పార్టీ క్రమశిక్షణ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కలిసి అన్ని విషయాలు వివరించానని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. నోటీసులపై లిఖిత పూర్వక సమాధానం ఇచ్చానన్నారు. అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆయన్ని కోరినట్లు చెప్పారు. వారం రోజుల్లో అన్ని అంశాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి తెలిపారని చెప్పారు. కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారని వివరించారు.

## తంత్రీ వాయిద్యకారుడు రమయ్యకు పురస్కారం

పెద్దపల్లి,జూన్18 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన, కడ్డీ తంత్రి వాయిద్య కళాకారుడు దురిచేటి రామయ్య కు కేంద్ర ప్రభుత్వ పురస్కార్ అవార్డు దక్కింది. ఆయన ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు పులి వెంకటేశంతో పాటు పలువురు రామయ్య ఇంటికి వెళ్లి అవార్డుకు ఎంపిక కావడం పట్ల శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రామయ్య కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

## ఛత్తీస్‌ఘడ్‌లో ఇసుక తవ్వకాల పంచాయితీ

### స్థానిక నేతను సజీవ దహనం చేసిన దుండగులు

రాయపూర్,జూన్18 : ఛత్తీస్‌గఢ్‌లో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఇరు వర్గాల మధ్య చెలరేగిన వివాదం దారుణ మలుపు తిరిగింది. స్థానిక నేత, జన్‌పద్ పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. కొరియా జిల్లాలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేశారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, స్థానికంగా ఇసుక తవ్వకాల కాంట్రాక్ట్‌ను భరత్ సింగ్ దక్కించుకున్నారు. ఈ క్రమంలో మనోజ్ త్రిపాఠీ వర్గంతో భరత్ సింగ్‌కు వివాదం మొదలైంది. ఇసుక తవ్వకాల కోసం వాడే టిప్పర్ ట్రక్‌లు త్రిపాఠీ కుటుంబానికి చెందినవని స్థానికులు తెలిపారు. దీంతో, ఇసుక తరలింపు, చెల్లింపుల విషయంలో భరత్ సింగ్, త్రిపాఠీ వర్గాల మధ్య వివాదం మొదలైంది. చివరకు ఇది ఆధిపత్య పోరుగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంగళవారం రాత్రి ఇసుక తవ్వకాలకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు భరత్ సింగ్ నౌగెయిన్ గ్రామానికి వెళ్లారు. దీంతో, అక్కడ వివాదం చెలరేగగా భరత్ సింగ్ ప్రయాణిస్తున్న ఫార్చూనర్ కారును కొందరు అడ్డగించారు. తప్పించుకునే వీలులేకుండా కారుకు ముందు, వెనుక లారీలను అడ్డుపెట్టారు. ఆ తరువాత కారుపై పెట్రలో పోసి నిప్పటించడంతో భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. భరత్ సింగ్‌తో పాటు కారులో ఉన్న విరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్ కూడా కాలిన గాయాలతో కన్నుమూశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మయాంక్ సింగ్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని మృతుల కుటుంబం డిమాండ్ చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశామని ఏఎస్పీ సురేషా చౌబే తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని అన్నారు.

# తమిళనాట అనూహ్య రాజకీయ పరిణామాలు

### సిఎం విజయ్‌తో వైకో భేటీతో ఊహాగానాలు

### డిఎంకెను వీడుతారన్న ప్రచారం

చెన్నై : తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తన స్థానాన్ని పదిలం చేసుకునే దిశగా సిఎం విజయ్ అడుగులు వేస్తున్నారు. ద్రవిడ పార్టీలు కలిసినా తన మనుగడకు ధోకా లేకుండా చేసుకుంటున్నారు. అందుకే అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు ఒక్కరొక్కరుగా రాజీనామా చేసి, టివికెలో చేరుతున్నారు. వీరంతా మళ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది. దీంతో అన్నా డిఎంకె కూడా పూర్తిగా బలహీనపడే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వైకో సిఎంతో భేటీ కావడం మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. డీఎంకేతో కలిసి పనిచేసిన పలువురు మాజీ మిత్రపక్షాలు ఇప్పటికే టీవీకే ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి. కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు అధికార వ్యవస్థలో భాగస్వాములయ్యాయి. మరోవైపు సీపీఐ, సీపీఎం పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండీఎంకే వైఖరి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. యితే.. ఈ ఊహాగానాలపై వైకో అప్రమత్తంగా వ్యవహస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలను సాధారణ మండలి ఆధ్వర్యంలోనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సీఎం విజయ్‌తో సమావేశం పూర్తిగా ప్రజా సమస్యలపైనే జరిగిందని పేర్కొన్నారు. తూత్తుకుడిలో వేదాంత గ్రూప్‌నకు అనుబంధంగా మరో రాగి పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాంటి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరానని వెల్లడించారు.

# నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

### రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్,జూన్18 : నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు . జూన్ 21న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్లు ప్రకటించారు . పరీక్షా రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్ష కోసం.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక మార్పులను ప్రకటించింది. ఎగ్జామ్ ను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విద్యార్థులకు అనుకూలంగా మార్చేందుకు ఎన్టీఏ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఈసారి ఎగ్జామ్ టైంను 195 నిమిషాలకు పెంచారు. ఎగ్జామ్ మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనుంది. ఎగ్జామ్ ప్రారంభానికి ముందు అటెండెన్స్ డాక్యుమెంట్స్ పై సైన్ లు చేయడం, ఇన్విజిలేషన్ లాంఛనాలు పూర్తి చేయడం వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల.. విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎన్టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది. దీనివల్ల అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టవచ్చు. ఎగ్జామ్ రోజున విద్యార్థులకు పూర్తి స్పష్టత, సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన ఈ కొత్త నిబంధనలను అభ్యర్థులందరూ గమనించాలని ఎన్టీఏ స్పష్టం చేసింది.

## విద్యాప్రమాణాలు పెంపొందించుకోవాలి

కరీంనగర్,జూన్18 : విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి అన్నారు. చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట గదులను, పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, పాఠ్యపుస్తకాలు, నోట్స్ పంపిణీ, ల్యాబ్, మొదలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలన్నారు. సెల్ఫోన్, సినిమాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయప్రద, ఉపాధ్యాయులు మంజుల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విద్యారంగంలో మార్పులు కావాలి !

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమానాతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి  పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ  ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో  విప్లవం సాధించగలం.

# వర్షాభావమైనా ఆహార భద్రతకు భరోసా



ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం దెబ్బతింటుందన్న భయాందోళనలు నెలకొన్నా మరోవైపు కేంద్రం వద్ద ప్రస్తుతం భారీగా ఆహారధాన్యాల నిల్వలు ఉండడంతో ఆహారభద్రతపై ఎలాంటి ఎల్‌నినో ప్రభావం ఉండబోదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. అయితే ఈ నిల్వలను వృథా కాకుండా సరిగ్గా పంపిణీ, విక్రయాలు సాగించగలిగితేనే ధరలు అదుపులో ఉంటాయి. దీనికి ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ అనే పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే వర్షాభావంతో దేశంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 200కు పైగా జిల్లాల్లో వ్యవసాయానికి ముప్పు వచ్చే పరిస్థితులు కమ్ముకొస్తున్నాయి. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉన్న 12 రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి. వర్షాలు సకాలంలో పడకపోవడంతో వరి వంటి నీటి అవసరాలపై ఎక్కువగా ఆధారపడే పంటల ఉత్పత్తికి ముప్పు ఏర్పడుతుంది. అయితే ప్రస్తుతం కేంద్రం వద్ద జూన్ 1 నాటికి రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల నిల్వలు 122 మిలియన్ టన్నుల వరకు ఉండడం విశేషం. ఏడాది పొడుగునా వరి వినియోగానికి ఇవి సరిపోతాయి. మొత్తం నిల్వల్లో 68.43 మిలియన్ టన్నుల వరి, 53.41 మిలియన్ టన్నుల వరకు గోధుమలు ఉన్నాయి. ఈ భారీ నిల్వల్లో సుమారు 80 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించాలంటే ఏటా 56 మిలియన్ టన్నులు అవసరం కాగా, ప్రస్తుత నిల్వలు దాదాపు రెండేళ్లపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఉచితంగా సరఫరా చేయడానికి సరిపోతాయి. అందువల్ల దేశానికి ఆహార భద్రతపై భరోసా లభిస్తోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణ వర్షపాతం నమోదు కాకపోయినా ప్రాథమిక ఆహార లభ్యతకు ఎలాంటి ఢోకా లేదు. ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ (ఒఎంఎస్ఎస్) ద్వారా గోధుమ, బియ్యం వంటి ఆహార ధాన్యాలను రాష్ట్ర ప్రభుత్వాలతోసహా భారీ సంఖ్యలో వినియోగదారులకు విక్రయించవచ్చు. సరిహద్దుల్లో కంచెకు చిక్కుకున్న జీవితాలు రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాల కోసం ఎఫ్‌సిఐ నుండి నేరుగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేయవచ్చు. ఆహార భద్రతను నిర్వహించడం, నిల్వలు వృథా కాకుండా చూడడం, మార్కెట్లో ధరలను అదుపులో ఉంచడం ఈ ఒఎంఎస్ఎస్ పథకం ఉద్దేశం. 2025 26లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.04 మిలియన్ టన్నులు కాగా, అంతకన్నా ఎక్కువగా 176.16 మిలియన్ టన్నుల ఉత్పత్తిని 2026 27లో సాధించాలని ప్రభుత్వం లక్షంగా నిర్దేశించుకుంది. ఇందులో 123.15 మిలియన్ టన్నుల వరి, 8.4 మిలియన్ టన్నుల కాయధాన్యాలు, 28.92 మిలియన్ టన్నుల చమురు గింజలు, 13.56 మిలియన్ టన్నుల చిరుధాన్యాలు. 31.04 మిలియన్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి చేయాలని చూస్తున్నారు. అయితే ఆహార ధాన్యల సద్వినియోగానికి ఒఎంఎస్ఎస్ పథకానికి భారీ కేటాయింపులు అవసరమని, ఇథనాల్ (ఇంధనం) ఉత్పత్తి కోసం సబ్సిడీ ధరలో బియ్యం కోటా కేటాయింపును తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇథనాల్ ఉత్పత్తి కోసం భారత ఆహార సంస్థ దగ్గర ఉన్న బియ్యాన్ని క్వింటాలుకు రూ. 2320 వంతున భారీ సబ్సిడీతో గతంలో ప్రభుత్వం కేటాయించింది. అయితే పెరుగుతున్న ఆహార భద్రత ఆందోళనలు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బియ్యం నిల్వలను కాపాడుకోవాలని, ధరల పెరగకుండా అదుపులో ఉంచడానికి ఈ కేటాయింపులు భారీగా తగ్గించాలని మాజీ అగ్రికల్చరల్ సెక్రటరీ సిరాజ్ హుస్సేన్ సూచించారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర 4.5 మిలియన్ టన్నుల వరకు పప్పుధాన్యాల నిల్వలు ఉన్నాయి. వీటి ధరలను అదుపులో ఉంచడం చాలా అవసరం. ఇదిలా ఉండగా వాతావరణ శాఖ అంచనా ప్రకారం సాధారణ వర్షపాతం 62.1 మిమీ కాగా, జూన్ 15 వరకు 42.4 మిమీ వర్షపాతమే లభించింది. అంటే దేశం మొత్తం మీద 32 శాతం లోటు వర్షపాతం కనిపిస్తోంది. సాధారణంగా దీనిని ఎదుర్కోడానికి కేంద్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. శాంతిసుమాలు విరబూయాలి ముఖ్యంగా పప్పు ధాన్యాల సాగు చాలా మందకొడిగా ప్రారంభమైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ జూన్ 12 నాటికి పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం 43 శాతం తగ్గిపోయింది. కంది, మినుము, పెసర, వంటి పంటల విత్తనాలు విత్తడం భారీగా పడిపోయింది. కర్ణాటక, మహారాష్ట్రలోని పప్పుధాన్యాల ఉత్పత్తి అత్యధికంగా జరిగే కీలక ప్రాంతాల్లో రైతులు వరుణ కటాక్షం కోసం నిరీక్షిస్తున్నారు. జూన్ 12 వరకు కంది విత్తనాలను 0.09 లక్షల ఎకరాల్లో వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ కంది సాగు విస్తీర్ణం 57 శాతం తక్కువ. మినుములు 0.27 లక్షల ఎకరాల్లో విత్తగా, గత ఏడాది ఇదే సమయానికి 0.35 లక్షల ఎకరాల్లో వేయడమైంది. అంటే 22 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది 1.54 లక్షల ఎకరాల్లో పెసర సాగు చేయగా, ఈ ఏడాది ఇప్పటికి 0.69 లక్షల ఎకరాల్లో విత్తారు. అంటే 55 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. కర్ణాటక ఈశాన్య ప్రాంతం, మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. మహారాష్ట్ర లోని లాతూరు, సోలాపూర్, తెలంగాణ రాష్ట్రంలో బఠానీ పండిస్తారు. లాతూరులో కందిసాగు ఇంకా ప్రారంభం కాలేదు. కర్ణాటకలోని కలబుర్గిలో కొన్ని ప్రాంతాల్లో కొన్ని వారాల క్రితం వర్షాలు పడడంతో పెసర సాగు ప్రారంభించారు. అయితే నాటిన విత్తనాలు నిలదొక్కుకోడానికి వర్షాలు అవసరం. పప్పుధాన్యాలు ప్రధానంగా పండించే మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కంది, మినుము, వంటి పంటల సాగు జులై మధ్య వరకు చేపట్టినా, పంట చేతికి వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుందని రైతులు చెబుతున్నారు.

## వెన్నుపోటు రాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

**కులలాల మధ్య తగవులు పెఓట్టడం ఆయనకే చెల్లింది**

**హోంమంత్రి అనితపై గుడివాడ వ్యాఖ్యలు దారుణం**

**మాజీమంత్రి సోమిరెడ్డి ఘాటు విమర్శలు**

నెల్లూరు,జూన్18 : వెన్నుపోటు పేరుతో ర్యాలీలు నిర్వహిస్తున్న జగన్ ముందుగా తన రాజకీయ చరిత్రను చూసుకోవాలని మాజీమంత్రి, టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మద్యనిషేధం సహా అన్ని హామీలు విస్మరించిన జగన్‌కు, కూటమి మేనిఫెస్టో గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు పారనివ్వకపోవడంతో కులాల మధ్య తగవులు పెట్టేందుకు సిద్ధమయ్యాడని ఆరోపించారు.జగన్‌కు దమ్మూధైర్యం ఉంటే డీఎస్సీలో అక్రమాలపై ఆధారాలతో చర్చకు రావాలని లోకేశ్ చేసిన సవాల్ స్వీకరించాలన్నారు. రొయ్యల ఫీడ్ కంపెనీలకు జగన్ కులం ఆపాదించడం సిగ్గుచేటన్నారు. అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. తమ ఇంట్లోనూ మహిళలు ఉన్నారనే విజ్ఞత మరిచి గొడ్డలి పార్టీ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. అమర్నాథ్ వ్యాఖ్యలపై జగన్ రాష్ట్ర మహిళలకు, హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని కూడా వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్ అని విమర్శించారు.  రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారని, ఏదైనా సంఘటన జరిగితే.. దానికి కులం రంగు పులిమి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమనేది జగన్ డీఎన్‌ఏలోనే ఉందని విమర్శించారు. కుల చిచ్చులో భాగంగానే గుడివాడ అమర్నాథ్ హోం మంత్రి అనితపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. అనితకు గుడివాడ అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మహిళ అనిత హోంమంత్రిగా ఎదగడాన్ని సహించడం లేదన్నారు. మహిళల పట్ల జగన్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందని పేర్కొన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమన్నారు. మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.  రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి కానీ వ్యక్తిత్వ హననానికి దిగడం వైసీపీ సంస్కృతికి నిదర్శమని అన్నారు. ప్రజాసమస్యలపై మాట్లాడలేని వారు వ్యక్తిగత దూషణలతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

## ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

అమరావతి,జూన్18 : ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా తెలుసుకోవచ్చు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, అవసరమైన వివరాలు నమోదు చేసి ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాల్లో 59 శాతం మంది, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 53 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెరుగైన ఫలితాలు పొందిన విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.


## సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

**కేసముద్రం మార్కెట్లో పెరిగిన కొనుగోళ్లు**

మహబుబాబాద్,జూన్18 : సన్న ధాన్యానికి మద్దతు పెరుగుతోంది. మార్కెట్లలో మద్దతు ధరలను మించి ధరలు పెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈయేడు సరిగా పంటలు పండకపోతే ధరలు పెరుగుతాయన్న భావనలో వ్యాపారులు ఉన్నారు.  మహబుబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ధాన్యం ధర ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.2,906 నమోదైంది. గత 15 రోజులుగా ఈ మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ రకం వడ్లరేట్ రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక మార్కెట్‌కు ఈ– వేలం'లో క్వింటాకు గరిష్ఠంగా రూ.2,906, కనిష్ఠంగా రూ.2, 226, సగటున రూ.2,589 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర  క్వింటాకు రూ.2,389 ఉండగా, ఈ సీజన్‌లో అంతకంటే ఎక్కువగానే మార్కెట్లో ధరలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉంటాయనే కారణాలతో వ్యాపారులు నిల్వ చేసేందుకు మార్కెట్లో ధాన్యం ఖరీదులు పెంచారు. ఈ క్రమంలో దేశీయంగా ధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో మార్కెట్లో ఈ సీజన్‌లో గత 15 రోజులుగా ధాన్యం సగటు ధర పెరుగుతూ వస్తోంది. ఈ నెల 1న ధాన్యం సగటు ధర రూ.2,475 నుంచి రూ.2,495 వరకు ఉన్నాయి. ఆ తర్వాత ఈనెల 4న సగటు ధర రూ.2, 589, 5న రూ.2636, 8న రూ.2,689, 9న రూ.2,729గా నమోదయ్యాయి. తాజా గా గరిష్ఠ ధర రూ.2,900 మార్కు దాటడం విశేషం.

## మంట కలుస్తున్న కుటుంబ బంధం !

తిరుమల : కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడంతో పాటు, నేను, నా భార్య అన్న కుటుంబం మాత్రమే స్థిరపడుతోంది. బంధాలు, బంధుత్వాలకు విలువలేని కాలం ఇది. ఆస్తుల పంపకాల విషయంలో బంధుత్వాలకు విలువ దక్కడం లేదు. ఆస్తులే పరమావధి అనుకుంటున్న వారు ఎంతకైనా తెగిస్తున్నారు. కొన్ని బంధాలు మనిషి పెరిగి పెద్దయ్యాక ఏర్పరుచుకుంటాడు. స్నేహితులు, జీవిత భాగస్వామి ఇవన్నీ ఈ కోవకే చెందుతాయి. అయితే, ఏ బంధం ఎప్పుడు, ఎందుకు ఏర్పడుతుందో ఊహించలేం. ఒకసారి ముడిపడిన బంధాన్ని తుంచు కోకుండా ఉండటం మన ప్రవర్తనలోనే ఉంటుంది.  ఆస్తి కోసం సోదర బంధాన్ని వదులుకోవడానికి సిద్ధపడతారు కొందరు. అదే ఆస్తిపాస్తులకు ఎక్కడ ఎసరు పెడుతుందో అని ఆప్యాయంగా పలకరించే సోదరికి కనిపించకుండా ముఖం చాటేసే వాళ్లూ ఉన్నారు. అవసాన దశలో ఉన్న తల్లిదండ్రులను భారంగా భావించి పేగుబంధాన్ని మరచి వారిని వృద్ధాశ్రమాల్లో పడదోసే ప్రబుద్ధులూ కోకొల్లలు. తన,పర అన్న భేదాలు పక్కన పెట్టి తల్లిదండ్రులతో తలపడడం, అన్నదమ్ములతో ఘర్షణ పడడం, అక్కా చెల్లెళ్లలతో గొడవలు పడడం అన్నది చూస్తున్నాం. కేవలం ఆస్తుల కోసమే ఇలా చేయడం దారుణం. బంధుత్వాలు పుట్టుకతో ఏర్పడతాయి. పుట్టగానే తల్లిదండ్రులనే బంధం కలుగుతుంది. ఆ ఇంట్లో వాళ్లతో రక్త సంబంధం ఏర్పడుతుంది. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, చిన్నమ్మ, పెద్దమ్మ, పెద్దనాన్న, మామయ్య ఇలాంటి బంధుత్వాలు పుట్టుకతో సహజంగా ఏర్పడతాయి.  ఏ బంధ మూ శాశ్వతం కాకపోవచ్చు. కానీ, భౌతికంగా జీవించి ఉన్నంత కాలం వాటిని కాపాడుకోవడం మానవ ధర్మం.పసితనంలో అమ్మ తప్ప మరో బంధం తెలియదు. కాస్త పెద్దయ్యాక నాన్న, అన్నదమ్ములు అన్న స్పృహ కలిగి వారితో అనుబంధం పెరుగుతుంది.వాటిని నిలుపుకోవడం అంత కష్టం. లౌకిక ప్రపంచంలో అందరూ తోడు కోరుకునేవారే! కానీ, ఒకానొక దశలో ఏ బంధం కోసం అంతగా ఎదురుచూశారో, అదే బంధాన్ని ప్రతిబంధ కంగా భావిస్తుంటారు. అవసరార్థం ఏర్పరుచుకున్న బంధాల్లో ఇలాంటి కప్పదాటు వైఖరులు కనిపిస్తుంటాయి.



ఆధ్యాత్మికం

# నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

## ● కమీషనర్, ఆర్ అండ్ ఆర్, ఇర్రిగేషన్ భూసేకరణ శివకుమార్





**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్అఆర్, ఇర్రిగేషన్ భూసేకరణ కమీషనర్ కె. శివకుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై ప్రాజెక్టుల వారిగా సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో ఉన్న పెండింగ్ అంశాలను వేగవంతంగా పరిష్కరించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమీక్ష సందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మున్నేరు--పాలేరు లింక్ కాలువతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని పరిశీలించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కోర్టు కేసులు మరియు సర్వే పనుల స్థితిగతులపై అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని, అవార్డుల జారీ, చెల్లింపుల ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని, రెవెన్యూ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమీషనర్ తెలిపారు. పెండింగ్ అంశాల పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి క్రమం తప్పకుండా పురోగతిని సమీక్షించాలని కమిషనర్ అన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ జిల్లాలో పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. జవహర్ లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్ట్ కు సంబంధించి 11 గ్రామాల్లో 193.15 ఎకరాల భూసేకరణ అవార్డ్ దశలో ఉందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్టు కు సంబంధించి 14వ ప్యాకేజి క్రింద 650.22 ఎకరాల భూ సేకరణ లో 623.02 ఎకరాలకు అవార్డ్ పాస్ చేసినట్లు కలెక్టర్ అన్నారు. 15వ ప్యాకేజీకి సంబంధించి 198.13 ఎకరాల భూసేకరణ కు గాను అవార్డ్ పాస్ చేసి, భూనిర్వాసితులకు పరిహారం చెల్లించామన్నారు. ప్యాకేజి16 కు సంబంధించి 820.12 ఎకరాలకు గాను అవార్డ్ పాస్ చేసినట్లు, 796.13 ఎకరాలకు పరిహారం చెల్లింపులు పూర్తి చేసి స్వాధీనం చేసుకున్నట్లు, మిగతా భూమికి పరిహారం ప్రభుత్వం నుండి రావాల్సి ఉన్నట్లు తెలిపారు. ప్యాకేజి 6, 2, 1 లకు సంబంధించి భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఇర్రిగేషన్ సిఈ లు ఎం. వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసి సదానందం, ఇర్రిగేషన్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం

## విద్యుత్ షాక్‌తో కూలి అక్కడికక్కడే మృతి



**కరీంనగర్ టౌన్, జూన్18(ది క్రైమ్ న్యూస్):** కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఓ పేద కార్మికుడి ప్రాణాన్ని బలితీసుకుంది. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం శ్రీనివాస్ నగర్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) నూతన భవన నిర్మాణ పనుల్లో గురువారం ఘోర ప్రమాదం జరిగింది. భవన నిర్మాణంలో భాగంగా ఐరన్ రాడ్లను పైకి లేపుతున్న క్రమంలో, సమీపంలోనే ఉన్న 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లకు ఆ రాడ్డు తగిలింది. దీంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై కరీంనగర్ అశోక్ నగర్‌కు చెందిన పెద్దపల్లి శ్రీకాంత్ (30) అనే కూలి అక్కడికక్కడే మృతి చెందాడు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు పొట్టకూటి కోసం వచ్చి శవమై మారడంతో మృతుడి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కాంట్రాక్టర్ కనీస రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబ యువకుడు మరణించడంతో అశోక్ నగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

# కార్మికులకు అండగా నిలుస్తూ, వేతనాల పెంపు, హక్కులు, చట్టాలను కాపాడేందుకు ఉద్యమిస్తోంది ఏఐటీయూసి

## - ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరణ - ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి





**కరీంనగర్ టౌన్, జూన్18(ది క్రైమ్ న్యూస్):** దేశంలోని అన్ని రంగాల కార్మికులకు అండగా నిలుస్తూ,కార్మికవర్గ శ్రేయస్సు కోసం,వారి వేతనాల పెంపు హక్కులు,చట్టాలను కాపాడేందుకు నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుంది ఏఐటీయూసీ అని, ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల,రాజన్న సిరిసిల్ల జిల్లాల ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ మరియు దాని అనుబంధ సంఘాల ముఖ్య నేతల సమావేశం ఆహ్వాన సంఘం అధ్యక్షులు పంజాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఏఐటీయూసీ, సిపిఐ రాష్ట్ర నాయకులు. ఎస్.బోస్, కలవేన శంకర్, ఎస్.బాల రాజు, పంజాల శ్రీనివాస్,టేకుమల్ల సమ్మయ్య తో కలిసి మహాసభల కరపత్రంను చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతదేశ కార్మిక సంఘాలలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఏఐటీయూసి ఉందని, కార్మిక వర్గాన్ని,ఉద్యోగ వర్గాన్ని ఐక్యం చేసి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదని, సంఘటిత అసంఘటిత రంగాలకు చెందిన కార్మిక వర్గానికి ఆశాజ్యోతి గా నిలిచిందని శ్రమకు తగ్గ ఫలితం కావాలని,పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, కనీస వేతనాల కోసం నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ఎంతోమంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపి అనేక చట్టాలు తీసుకువచ్చిన కార్మిక సంఘమని, చట్టాలు, హక్కులను కూడా కాపాడిన సంఘం ఏఐటీయూసి అన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను,చివరికి సమ్మె చేసే హక్కును కూడా కాలరాయడానికి బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని కార్పోరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల, కర్షకుల వ్యతిరేకిగా కేంద్ర ప్రభుత్వం ఉందని, ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సంస్కరణల పేరుతో రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా చేసి కార్మికులకు తీరని అన్యాయం మోడీ చేశాడని వెంకటరెడ్డి విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో సెప్టెంబర్ 6,7,8 తేదీలలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసి నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని, అందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మిక వర్గం, నాయకత్వం పనిచేయాలని ఎఐటీయూసి రాష్ట్ర ఇంచార్జ్, ప్రధాన కార్యదర్శి వి.ఎస్.బోస్, ఎస్.బాల రాజు పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో మహాసభల ఫ్యాట్రన్ కలవేన శంకర్, ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, టేకుమల్ల సమ్మయ్య, కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడారి సునీల్, ఏం.డి. ముక్రశీ, సుతారి రాములు, అజ్ఞ వేణు, కడారి రాములు, ఆహ్వాన సంఘం నాయకులు పొనగంటి కేదారి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, పిట్టల సమ్మయ్య, కాశెట్టి లక్ష్మయ్య, వెల్దశీడి దామోదర్, అల్లేపు రాజు, నిఖిల్, కేంసారం నర్సయ్య, కొమురయ్య, కవిత, స్వరూప, రాధ, మమత, భీరయ్య, ఏం.తిరుపతి, గందే కొమురయ్య, గంగుల ఆయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలే కాలం అప్రమత్తంగా ఉండాలి

## రామగుండం మేయర్ మహంకాళి స్వామి



**గోదావరిఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** అంటువ్యాధుల నుండి అప్రమత్తంగా ఉండాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా గురువారం 46వ డివిజన్ సంజయ్ గాంధీ నగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలకు నిలయమై అంటు వ్యాధులు విజృంభించే అవకాశం ఉంటుందని అన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి అంటు వ్యాధుల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగవలసి వస్తుందని అన్నారు. కాబట్టి చెత్త బహిరంగ ప్రదేశాలలలో, కాలువల్లో వేయకుండా నగర పాలక సంస్థ వాహనాలకు అందించాలని కోరారు. కాగా ఈ సందర్భంగా సంజయ్ గాంధీ నగర్ రోడ్ లో సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టి రోడ్డుకు ఇరువైపులా దారికి అడ్డంగా పెరిగిన పొదలు, చెట్ల కొమ్మలు, నాలా శుభ్రం చేయడానికి వీల్లేకుండా పైన పరిచిన రాళ్ళను తొలగించారు, నాలాల లో పూడిక తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు నవీన్, మీర్, పబ్బాల శ్రీనివాస్. సంపత్, చంద్రా రెడ్డి , మెప్మా సి ఓ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.

# హాలియా మున్సిపాలిటీలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహణ





**నల్గొండ ప్రతినిధి జూన్ 18 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీలో గౌరవ మున్సిపల్ చైర్మన్ శ్రీ చింతల చంద్రారెడ్డి గారి అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, పౌర సౌకర్యాల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ శ్రీ చింతల చంద్రారెడ్డి గారు మాట్లాడుతూ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు, రాబోయే వర్షాకాలానికి సన్నద్ధత చర్యలు, నిరంతరాయ తాగునీటి సరఫరా కోసం బోర్‌వెల్‌ల మరమ్మతులు, నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే అమృత్ స్కీం కింద నిర్మిస్తున్న వాటర్ ట్యాంకులు మరియు పైప్‌లైన్ పనులను మూడు నెలల్లో పూర్తి చేసి హాలియా పట్టణంలో తాగునీటి సమస్యను పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన సోలార్ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని, మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు పురోగతిలో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి అమృత్ స్కీం కింద నిర్మిస్తున్న ట్యాంకులు, పైప్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. హాలియా మున్సిపాలిటీ నివాసితుల అవసరాలను తీర్చడం, పౌర సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా చేపట్టిన కీలక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులపై కూడా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజారమేష్ యాదవ్, 2వ వార్డు కౌన్సిలర్ నకిరికంటి అన్నపూర్ణ, 3వ వార్డు కౌన్సిలర్ కుందూరు వెంకటరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ కడమంచి ప్రమీల, 5వ వార్డు కౌన్సిలర్ చిట్టి పోలీస్ శ్రీదేవి, 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు, 8వ వార్డు కౌన్సిలర్ గౌహర్ జబిన్, 9వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 10వ వార్డు కౌన్సిలర్ పిల్లి చంద్రకళ, కో-ఆప్షన్ సభ్యులు కొమ్మనబోయిన జయమ్మ, చెన్ను రాజేశ్వరి, వర్కాల శేఖర్ రెడ్డి, ఎండి రషీద్, మున్సిపాలిటీ అధికారులు, విద్యుత్ శాఖ ఏఈ, హౌసింగ్ శాఖ ఏఈ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రజా సమస్యల పరిష్కారం, తాగునీటి సదుపాయాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుపై చర్చలతో ముగిసింది.

# నగరాభివృద్ధిలో భాగంగా పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ టౌన్, జూన్ 18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ 6వ డివిజన్ బొమ్మకల్ ప్రాంతంలో నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు శానిటేషన్ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం 17వ, 18వ డివిజన్లలో చేపడుతున్న మంచినీటి బావి తవ్వకం పనులను మేయర్ ప్రారంభించారు. నగర ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ సందర్భంగా ఆధునీకరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రైమరీ హెల్త్ సెంటర్) భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఆరోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు ఈ భవనం ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలలో పేరుకుపోయిన సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, అడిషనల్ కమిషనర్ సువార్త, మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాతినిధ్య సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం



**రామగిరి, జూన్ 18(ది క్రైమ్ న్యూస్):-** రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం అయినటువంటి సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ప్రతినిధులతో గురువారం జి.యం. కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, తో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో పన్నూరు క్రాస్ రోడ్ నుండి ఓసిపి-వన్ ఫేస్-టు వరకు రోడ్డు వేయడం, సెంటినరీ కాలనీ డిస్పెన్సరీ నందు రెండు ఏసీ లను, ఫిజియోథెరపీ రూమును ఏర్పాటు చేయడం, రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో ఉన్న యోగా మందిరం పై రేకులు మార్చి ఫ్లోర్ టైల్స్ వేయడం, ఓసిపి-వన్ , ఓసిపి-టు , ఏ ఎల్ పి లలో ఉన్నటువంటి స్క్రాప్ ను సేల్ చేయడం, జీడీకే-10 వ గని మూసి వేస్తున్నందుకుగాను అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఓ సి -వన్ , ఓసి -టు లకు బదిలీ చేయడం, సీఎం పిఎఫ్ లో కొత్త విధానం 2018 నుండి పేమెంట్ టైటిల్స్ ఉంటేనే పెన్షన్ ఇస్తామని అంటున్నారని, వెంటనే పరిష్కారం చేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఇబ్బంది పడకుండా చూడడం, డంపర్లు, డోజర్లు, షావల్స్, లలో ఉన్న పాత ఏసీలను మరమ్మతులు చేయడం వల్ల ఖర్చు ఎక్కువ అవుతుందని అయినా సరిగా పనిచేయడం లేదని కొత్త ఏసీలను అమర్చాలని, జీఎం కార్యాలయం, ఓసిపి-వన్ , ఓసిపి-టు , అడ్రియాల లాంగ్ వాల్ లలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాల కోసం చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడం, ఓసిపి-టు ఉపరితల గని నుండి మెయిన్ రోడ్డు కు వెళ్లే రోడ్డుపై ఆర్ అండ్ బి వారిచే స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయించడం, అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో గల ఆర్వో ప్లాంట్ను మరమ్మతులు చేయించడం, లాంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల ద్వారా వివరాలను సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అదేవిధంగా కార్పోరేట్ కార్యాలయ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు ఎ.రామారావు, తిరుపతి, సాయికృష్ణ, ఎన్.శ్రీనివాస్ రావు, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫ్యాటింగ్, ఐ ఇ డిజియం బి.టి. మురళీ కృష్ణ, సివిల్ డిజియం రాజేంద్ర కుమార్, సిహెచ్పి డిజియం కాశీ విశ్వేశ్వర రావు, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఇంజినీర్ చంద్ర శేఖర్, మేనేజర్ కె.వి.రామరావు, డివైపియం వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక, మహిమాన్విత, అమ్మవార్ల దివ్య క్షేత్రం

# శ్రీ మహాశక్తి దేవాలయ షోడశ వార్షికోత్సవం

## ● వేడుకలకు హాజరుకానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్





**కరీంనగర్ టౌన్, జూన్18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లాలో అత్యంత ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతు, కరీంనగర్ ప్రజల ఆరాధ్య దైవం, మహిమాన్విత శక్తి స్వరూపులైన శ్రీ మహాదుర్గా, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లతో కొలువుదీరి భక్తుల పాలిట కొంగుబంగారంగా మారిన దివ్య పుణ్యక్షేత్రం "శ్రీ మహాశక్తి దేవాలయ" షోడశ (16వ) వార్షికోత్సవ వేడుకలకు సిద్ధమైంది. 19 వ తేదీ శుక్రవారం రోజున జరగనున్న వార్షికోత్సవ వేడుకల కోసం ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అత్యంత వైభవంగా వేడుకలను, ప్రత్యేక పూజా కార్యక్రమాలను శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ హాజరుకానున్నారు. వార్షికోత్సవం రోజైన శుక్రవారం (జూన్ 19) నాడు ఆలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించనున్నారు. ఉదయం 4:30 నిమిషాలకు జగద్గురువుల కరకమలములచే శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు, అనంతనాగేంద్ర స్వామి వారికి అత్యంత వైభవంగా అభిషేక పూజలు ,ఉదయం 8:00 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, గణపతి పూజ, అఖండ దీపారాధనము, సర్వతోభద్ర మండల పూజలతో పాటు లోకకల్యాణార్థం లక్ష్మీగణపతి హోమము, రుద్ర సహిత చండీ హోమము, పూర్ణాహుతి, మంత్రపుష్పం అనంతరం జగద్గురువుల అనుగ్రహ భాషణం (ఆశీర్వచనం), తదనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం ఉంటుంది.. త్రిశక్తుల స్వరూపం – మహిమాన్విత దివ్య క్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం ఒకే దేవాలయ ప్రాంగణంలో అత్యంత శక్తివంతమైన ముగ్గురు అమ్మవార్లు త్రిశక్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చే అరుదైన పుణ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం.లిశ్రీ మహాదుర్గ భక్తులకు రక్షణను, ధైర్యాన్ని ప్రసాదించే శక్తి స్వరూపిణి.శ్రీ మహాలక్ష్మి అష్టైశ్వర్యాలను, కుటుంబ సౌఖ్యాన్ని, వ్యాపార వృద్ధిని ఇచ్చే లక్ష్మీదేవి.శ్రీ మహాసరస్వతి చదువుల తల్లి, జ్ఞానాన్ని ప్రసాదించే విద్యా స్వరూపిణిల ఆధ్యాత్మిక నిలయం శక్తివంతమైన పూజా విధానాలతో అలరారే ఈ ఆలయం భక్తులకు నేడు సమస్త భక్తుల పాలిట కొంగు బంగారంగా మారింది. 15 ఏళ్ల భక్తుల అచంచల విశ్వాసంతో ఈ ఆలయం కరీంనగర్ జిల్లాలోనే కాకుండా ఉత్తర తెలంగాణలోనే ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఎదిగింది. ఇక్కడి అమ్మవారిని దర్శించుకుని మనసారా మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని, ముఖ్యంగా వ్యాపార వృద్ధి, చదువు, కుటుంబ సౌఖ్యం కలుగుతాయని భక్తుల బలమైన నమ్మకం. అమ్మవారి ఆశీస్సులతో భక్తుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న క్షేత్రంగా శ్రీ మహాశక్తి దేవాలయం ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా దేవాలయంలో కన్నుల పండుగగా అనేక ప్రధాన ఉత్సవాలు, పండుగ వేళల్లో ఉగాది, శ్రీ సీతారాముల కళ్యాణం, వసంత పంచమి, మహాశివరాత్రి, సంకటహర చతుర్ధి, శ్రావణ మాస ప్రత్యేక పూజలు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, వినాయక నవరాత్రులు, దీపావళి , తులసి కళ్యాణం, అయ్యప్ప స్వామి పడిపూజ , మార్గశిర మాసం– ధనుర్మాసం, రుద్ర సహిత చండీ హోమం, నాగుల పంచమి, చవితి లాంటి పర్వదినాల్లోఆలయంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ప్రధానంగా దసరా నవరాత్రి ఉత్సవాలు ఇక్కడ అత్యంత వైభవంగా జరుగుతాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరిస్తారు. ఈ సమయంలో ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు, అన్నదానాలు భారీ ఎత్తున దాండియా నృత్యాలు ఘనంగా ప్రతిఏటా నిర్వహిస్తారు. అలాగే విజయదశమి సమయంలో ఇక్కడ భవానీ మాల ధరించిన దీక్షాపరుల కోలాహలం ఎక్కువగా ఉంటుంది. విజయవాడ తర్వాత అదే స్థాయిలో భవాని మాల ధారులకు శ్రీ మహాశక్తి దేవాలయం ఆధ్యాత్మిక కేంద్ర బిందువుగా మారింది అనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి ఏటా వేలాదిమంది దీక్షపరులు ఇక్కడ భవాని మాల ధారణ చేస్తున్నారు. ప్రముఖ రాజకీయ, సామాజిక నాయకులు సైతం ఇక్కడ దీక్షలు చేపట్టడం విశేషం.శ్రీ మహాశక్తి దేవాలయంలో నిర్వహించే విశిష్ట పూజలు, భక్తి ప్రపత్తులకు నిలయమైందివిశేష పూజలకు, పర్వదినాల ఆధ్యాత్మికతకు, భక్తికి చిరునామాగా నిలుస్తున్న శ్రీ మహాశక్తి దేవాలయం భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతోంది. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు ప్రతిరోజూ అశేష సంఖ్యలో తరలివచ్చే ఈ క్షేత్రంలో, విశేష పర్వదినాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దేవాలయంలో నిర్వహించే వేడుకలు పర్వదినాల్లో కోరికలను తీర్చే శ్రీ మహాశక్తిని దర్శించుకుని, విశేష పూజలలో పాల్గొని అమ్మవారి పరిపూర్ణ అనుగ్రహాన్ని భక్తులు పొందుతుంటారు. ఈనెల 19, శుక్రవారం రోజున జరిగే ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో, పూజా కార్యక్రమాలలో కూడా హిందూ బంధువులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని, త్రిశక్తి స్వరూపులైన శ్రీ మహాశక్తి దేవాలయ అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# అబద్దాలు చెప్పడంలో తప్పుడు హామీలు ఇవ్వడంలో దిట్ట కాంగ్రెస్ పార్టీ



**కరీంనగర్ టౌన్, జూన్18(ది క్రైమ్ న్యూస్):** మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిన్న కాంగ్రెస్ పార్టీలో చేరిన లింగాపూర్ గ్రామ యువకులు బిజెపి కార్యకర్తలని చెప్పుకోవడం సిగ్గుచేటు. సుమారు 40 మంది యువకులు అందునా బిజెపి పార్టీ కార్యకర్తలు అని చెప్పి వాళ్ల నాయకులు ఎమ్మెల్యేని తప్పుదోవ పట్టించడం అనేది మండలంలోని కాంగ్రెస్ నాయకులకె చెల్లుతుంది.దీని పైన ఎమ్మెల్యే విచారణ చేసుకోవాలి. చేరిన యువకుల్లో ఏ ఒక్కరూ కూడా బిజెపికి చెందినవారు కాదు వారికి కనీసం ప్రాథమిక సభ్యత్వం కూడా బిజెపిలో లేదు మరి అటువంటి వ్యక్తులు బిజెపికి చెందిన కార్యకర్తలు ఎలా అవుతారు. ఇంకా అత్యంత హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై పార్టీలో చేరారని చెప్పుకోవడం వాళ్ల దిగజారుడుతనానికి నిదర్శనం. మానకొండూరు మండలంలో ఏమి అభివృద్ధి చేశారు ఒక్క రోడ్డు అయినా వేశారా ? ఏ రోడ్డు కోసం అయితే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కవ్వంపల్లి సత్యనారాయణ గారు నేటి ఎమ్మెల్యే పాదయాత్ర చేశారో ఆ రోడ్డును పూర్తి చేశారా? అత్యంత తీవ్రంగా బాధపడుతున్నటువంటి మానకొండూరు నుంచి వేగురుపల్లి వరకు ఆ రోడ్డు అత్యంత దారుణమైన స్థితిలో ఉంది అయినా అదే ప్రాంతంలో ఉన్నటువంటి యువకులు అభివృద్ధి పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరారు అని చెప్పుకోవడం మీ మూర్ఖత్వానికి నిదర్శనం. ఒక్కసారి ఎమ్మెల్యే మానకొండూరు నుంచి వేగురుపల్లి వరకు అదే రోడ్ వెంబడి వెళ్తే వారికి ఆ రోడ్డు పరిస్థితి అక్కడి ప్రజలు పడుతున్నటువంటి బాధలు తెలుస్తాయి. నాటి బి ఆర్ యస్ ప్రభుత్వం అయినా నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అయినా మానకొండూర్ అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదు.వేగురుపల్లి లో మానేరు వాగుపైన నిర్మించిన బ్రిడ్జి మరియు ఆ రోడ్డు ఇంతవరకు దాధాపు 12 ఏళ్ళు అవుతుంది అయినా పట్టించుకునే నాధుడు లేడు. కరీంనగర్ నుండి జమ్మికుంట వరకు వేస్తున్న రోడ్డు అదీ దాధాపు 12 ఏళ్ళు అవుతుంది. ఇదే రోడ్డు గురించి నేటి స్థానిక ఎమ్మెల్యే పాదయాత్ర కూడా చేసినారు. కానీ నేడు ఎమ్మెల్యే గెలిచి అధికారం చేతిలో ఉన్నా నిధుల్ని మంజూరు చేయించడంలో విఫలం అయ్యారు. నేను కూడా నాటి ఎమ్మెల్యే లాగానే అని నిరూపించుకున్నారు.పక్కన ఉన్నటువంటి నియోజకవర్గాలలో రోడ్లు బాగుంటాయి అక్కడికి నిధులు వస్తాయి అక్కడికి కొత్త రోడ్లు వేసుకుంటున్నారు డబుల్ లైన్ రోడ్లని నాలుగు లేన్ల చేసుకుంటున్నారు సింగిల్ లైన్ రోడ్లని డబుల్ వేసుకుంటున్నారు కానీ ఇక్కడ ఉన్నటువంటి ఏ రోడ్డును కూడా తట్టెడు మట్టి ఎత్తిపోసినటువంటి దాఖలాలు లేని పరిస్థితి. అయినా అభివృద్ధి చేసినం సంక్షేమ పథకాలు ఏ సంక్షేమ పథకాలు ఎంతమందికి అందించారో చెప్పాలి. రుణమాఫీ విషయంలో ఎక్కడ పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగింది ఆ విషయం ఇంతవరకు లేదు, రైతు భరోసా పక్కన పెట్టారు, బోనస్ 500 రూపాయలు బోర్డు తిప్పేశారు.మహిళకి 2500 రూపాయలు ఇస్తామని అది అటకెక్కింది, పెన్షన్లు 4000 చేస్తానన్నారు అది పక్కన పెట్టింద్రు.ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలే, స్కాలర్షిప్లు బకాయిలే కాంట్రాక్టర్లకు చెల్లింపులు బకాయిలే, హాస్టల్స్ లో ఉన్నటువంటి కాంట్రాక్టర్లకు కూడా బకాయిలే నాణ్యమైనటువంటి ఆహారాన్ని అందించలేని పరిస్థితి పిల్లలకి ఎక్కడ ఏ విషయంలో ఏ సంక్షేమ పథకాలు ఏవి మీరు ఇచ్చారో చెప్పాలి. ఇంకా అభివృద్ధి సంక్షేమం అనే మాటలు మీరు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ కూడా అబద్ధాలు చెప్పుకోవడం తప్పుడు వాగ్దానాలు ఇవ్వడం ఉత్త మాటలు చెప్పడం ఉద్దర ఖాతాలు పెట్టడం ఇది వారి పరిస్థితి. నిన్న జరిగినటువంటి వ్యక్తులు వాళ్ళందరూ కూడా ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షులు మరియు వాళ్ళ సభ్యులు. ఇసుక ట్రాన్స్పోర్ట్ చేసే వ్యక్తులు. వాళ్ళు కూడా వాళ్ళ సొంత అవసరాల కోసమే చేరినట్టు సమాచారం. పైగా వాల్లు కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులే. కేవలం మానకొండూరు మండలంలో అదేవిధంగా మానకొండూరు నియోజకవర్గం లో ఎదుగుతున్నటువంటి భాజపాను నిలవరించడం కోసమే ఇలాంటి తప్పుడు చేస్తున్నారు. కుట్ర పూరితంగానే గానే బీజేపీ ఎదుగుదలను ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆడుతున్న డ్రామా ఇదంతా. దమ్ముంటే మండలంలోని కాంగ్రెస్ నాయకులు నిన్న మీ పార్టీలో చేరిన యువకుల్లో ఎంతమందికి బిజెపి పార్టీలో ప్రాథమిక సభ్యత్వం ఉందో నిరూపించారలి లేదంటే మానకొండూరు మండల కేంద్రంలో ఒప్పుకోని క్షమాపణలు చెప్పాలని మానకొండూరు బీజేపీ మండల శాఖ తరపున డిమాండ్ చేస్తున్నాం.

# అన్నం సేవా ఫౌండేషన్ ఆశ్రయితులకు ఆధార్ నమోదు

## గుర్తింపు, గౌరవప్రద జీవనానికి కొత్త ఆశలు




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** నిరాశ్రయులు, అనాథలు మరియు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తున్న అన్నం సేవా ఫౌండేషన్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం ఆశ్రయితుల జీవితాల్లో కొత్త ఆశలను నింపింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, అలాగే కొందరికి కుటుంబాలతో పునరేకీకరణకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ (టి ఎస్ ఎల్ ఎస్ ఏ) సభ్య కార్యదర్శి శ్రీ పంచాక్షరి ఆదేశాలు, జిల్లా న్యాయ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు (ఇన్‌చార్జ్), జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జి.వి. మహేష్ నాథ్ మార్గదర్శకత్వంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస అన్నం సేవా ఫౌండేషన్‌ను సందర్శించి ఆశ్రయితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఆశ్రయితులలో చాలామందికి గుర్తింపు పత్రాలు లేకపోవడం వల్ల సంక్షేమ సేవలు, ఇతర ప్రయోజనాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా యంత్రాంగం మరియు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి ఆశ్రమంలోనే ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరం నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టరేట్ మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక శిబిరం నిర్వహణకు సహకరించారు. శిబిరంలో ఆశ్రయితుల బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టారు. ఇప్పటికే గతంలో ఆధార్ పొందిన వారి వివరాలు గుర్తించబడితే వాటిని తిరిగి పొందేందుకు చర్యలు తీసుకోనున్నారు. అటువంటి వివరాలు లభించిన పక్షంలో వారి అసలు గుర్తింపును నిర్ధారించి కుటుంబ సభ్యులను గుర్తించే అవకాశం ఉంటుంది. కుటుంబ వివరాలు లభించిన వారికి పునరేకీకరణ దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వివరాలు లభించని వారికి కొత్త ఆధార్ కార్డులు జారీ చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస మాట్లాడుతూ, "గుర్తింపు పత్రం అనేది కేవలం ఒక కార్డు మాత్రమే కాదు. సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న వ్యక్తులకు అది గౌరవప్రదమైన జీవనం, సంక్షేమ సేవలు మరియు న్యాయ పరిరక్షణకు ద్వారంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఆధార్ నమోదు పూర్తయిన అనంతరం జాతీయ న్యాయ సేవా సంస్థ (ఎన్ ఏ ఎల్ ఎస్ ఏ) అమలు చేస్తున్న నిరాశ్రయులు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు, సామాజికంగా విస్మరించబడిన వర్గాలు మరియు పేదరికంలో జీవిస్తున్న వారికి సంబంధించిన వివిధ న్యాయ సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆశ్రయితులకు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులో గౌరవప్రదంగా జీవించే హక్కు కూడా అంతర్భాగమేనని, సమాజంలోని అత్యంత బలహీన వర్గాలకు గుర్తింపు, న్యాయ సహాయం మరియు సంక్షేమ అవకాశాలు చేరేలా చూడటం న్యాయ సేవా సంస్థల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఏళ్ల తరబడి గుర్తింపు పత్రాలు లేకుండా, కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియని పరిస్థితుల్లో జీవిస్తున్న పలువురు ఆశ్రయితులకు ఈ ఆధార్ నమోదు శిబిరం కొత్త ఆశాకిరణంగా మారింది. గుర్తింపు, సంక్షేమ సేవల ప్రాప్తి, కుటుంబాలతో తిరిగి కలిసే అవకాశాలకు ఈ కార్యక్రమం మార్గం సుగమం చేయనుంది.

# ఆత్మహత్య చేసుకుని యువకుడు మృతి



**లక్షెట్టిపేట, జూన్ 18, (ది క్రైమ్ న్యూస్):** పట్టణంలోని సీఎస్ఐ చర్చి రోడ్లో నివాసం ఉండే మద్దెల వివేక్(24) అనే యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్సా పొందుతూ మృతి చెందినట్లు స్థానిక ఎస్సై గోపతి సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడు డిగ్రీ విద్య మధ్యలో ఆపి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. తన ఇద్దరు చెల్లెలు మంచిగా చదువుకొని ప్రైవేటు ఉద్యోగాలు చేస్తుండగా తాను మాత్రం చదువు మధ్యలో ఆపి ఖాళీగా ఉంటున్నానని మనస్థాపం చెంది ఈనెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంట కొట్టే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా స్థానికులు కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుని తండ్రి కమలాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు.

# కరీంనగర్ తహసీల్దార్ కార్యాలయాల్లో విద్యా ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలి

## - డీఆర్ఓకు ఏఐఎంఐఎం వినతి



**కరీంనగర్ టౌన్, జూన్ 18(ది క్రైమ్ న్యూస్):** ప్రస్తుత విద్యా ప్రవేశాల (అడ్మిషన్ల) సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి తహసీల్దార్ (ఎంఆర్ఓ) కార్యాలయాలలో విద్యార్థుల విద్యా ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఏఐఎంఐఎం కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సాబ్ కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) జె. స్వామి ని కలిసి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం అడ్మిషన్ల సమయం కావడంతో వేలాది మంది విద్యార్థులకు ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ వసతుల కోసం కులం, ఆదాయం, నివాసం, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ , గ్యాప్ సర్టిఫికేట్లతో పాటు ఇతర ధృవపత్రాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. సర్టిఫికేట్ల జారీలో ఆలస్యం కావడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ధృవపత్రాల దరఖాస్తులను కేవలం 2 నుంచి 3 రోజుల్లోగా పరిశీలించి, జారీ చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో సర్టిఫికేట్లు అందడం వల్ల విద్యార్థులు ఆలస్యం లేకుండా అడ్మిషన్లు పొందే అవకాశం ఉంటుందని, ఇది పారదర్శకమైన, ప్రజాస్వామ్య పౌర-స్నేహపూర్వక పాలనకు నిదర్శనంగా నిలుస్తుందని డీఆర్ఓకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం నాయకులు మజీద్ హుస్సేన్, ఇబ్రహీం, అన్నెమల్ల సురేష్, గఫార్ భాయ్, ఆరిఫ్ భాయ్, లింగంపల్లి శ్రీను, రోండి అరుణ్, మీరాజ్, షకీర్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థినికి అండగా నిలిచిన నూకల వేణుగోపాల్ రెడ్డి



**మిర్యాలగూడ, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నిరుపేద కుటుంబానికి చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని మహేశ్వరికి కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి ఆర్థిక చేయూత అందించారు. మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురానికి చెందిన మహేశ్వరి బీటెక్ మొదటి సంవత్సరం చదువుకోనుండగా, హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ కళాశాలలో సీఎస్‌సీ కోర్సులో ఉచిత సీటు సాధించింది. అయితే హైదరాబాద్‌లో ఉండి చదువుకోవడానికి అవసరమైన హాస్టల్ ఖర్చులను భరించే ఆర్థిక స్తోమత కుటుంబానికి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న నూకల వేణుగోపాల్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ బుమ్మితి నవీన్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డితో మాట్లాడి, మహేశ్వరి హాస్టల్ ఖర్చుల కోసం ప్రతి నెల రూ.5,000 అందించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే తొలి విడతగా రూ.5,000 నగదును మహేశ్వరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నూకల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదని, తమ వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, చిన్నపంగ శ్రవణ్, నూకల వేణుగోపాల్ రెడ్డి తనయుడు శ్రీమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవాలి

## జిల్లా బిసి అభివృద్ధి అధికారి జె. రంగారెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9వ, 10వ తరగతి బీసీ విద్యార్థుల కోసం 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రీ, మెట్రిక్ ఉపకార వేతనాలను ప్రభుత్వం రుపాయలు 4,000/- గా నిర్ణయించిందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జె. రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఉపకార వేతనాలకు సంబంధించి ఫ్రెష్ , రెన్యువల్ విద్యార్థులు ముందుగా ఎన్ఎస్‌పి ఓటిఆర్ ద్వారా ఆధార్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని 14 అంకెల నంబర్‌ను పొందాలని, వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలతో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లోని 9వ, 10వ తరగతి బీసీ విద్యార్థుల (ఫ్రెష్ , రెన్యువల్) వివరాలను ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సరిచూసి నమోదు చేయాలని, సంబంధిత దరఖాస్తుల హార్డ్ కాపీలను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో సమర్పించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపు

● విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలి ● విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు లక్ష్యబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన ఉపాధ్యాయులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత విద్యా సంవత్సరంలో పనిచేసిన విద్యా వాలంటీర్ల సేవలను ఈ విద్యా సంవత్సరంలోనూ కొనసాగిస్తామని తెలిపారు. అవసరమైతే స్థానికంగా విద్యా వాలంటీర్లను నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఏ పాఠశాలలోనూ ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఉపాధ్యాయులందరూ ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా 100 శాతం హాజరు నమోదు చేయాలని, ప్రతి రోజు హాజరు వివరాలను పర్యవేక్షిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల సెలవుల మంజూరు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను 10 శాతం పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 3 వేల మంది కొత్త విద్యార్థులను చేర్పించాలని, ప్రతి మండలానికి 300 మంది విద్యార్థుల చేర్పు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలను యూడైస్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 15 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న 120 పాఠశాలలు, సున్నా నమోదు ఉన్న 35 పాఠశాలలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అలాగే మోడల్ స్కూళ్లలో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. తక్కువ నమోదు ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి అభార్ నంబర్ జనరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, యూడైస్ వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. విద్యార్థుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్లను పూర్తిగా భర్తీ చేయాలని, అర్హులైన ఏ విద్యార్థి ప్రవేశాన్ని తిరస్కరించవద్దని ఆదేశించారు. కేజీబీవీల్లో వాచ్‌మెన్, ఉపాధ్యాయులు, వంట మనుషుల ఖాళీలు ఉన్నట్లయితే వెంటనే నియామకాల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఉన్నత తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోటీ పరీక్షల శిక్షణ అందించేందుకు వారానికి ఒకసారి అన్‌అకాడమీ, ఫిజిక్స్‌వాలా వంటి డిజిటల్ విద్యా వేదికల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన కంప్యూటర్ వ్యవస్థలు, ఇంటర్నెట్ సౌకర్యాలు, ఇతర వనరులను వచ్చే పది రోజుల్లో సిద్ధం చేయాలని, కార్యక్రమాల షెడ్యూల్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, కాంప్లెక్స్ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి పెట్టాలని




తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులే నివేదికల్లో ప్రతిబింబించాలని, తప్పుడు గణాంకాలకు తావు ఇవ్వొద్దని సూచించారు. తక్కువ ఫలితాలు సాధిస్తున్న పాఠశాలలపై ఈ విద్యా సంవత్సరంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని అన్నారు. ఏఎక్స్‌ఎల్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి శనివారం కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సమీక్షల ద్వారా విద్యా ప్రమాణాల్లో గణనీయమైన మార్పు సాధించవచ్చని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో పకడ్బందీగా టైమ్‌టేబుల్ రూపొందించి అమలు చేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల సమస్యలను అధికశాతం పరిష్కరించినందున వచ్చే 45 రోజులు ప్రాథమిక విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జూలై నెల నుంచి అన్ని పాఠశాలలు పూర్తి స్థాయిలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని 48 ప్రీ-ప్రైమరీ పాఠశాలలకు అవసరమైన నియామక ప్రక్రియ పూర్తయిందని, వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చిన్నారులకు విద్య ఆనందదాయకంగా ఉండేలా బొమ్మలు, విద్యా సామగ్రి అందుబాటులో ఉంచాలని తెలిపారు. నాబార్డ్ నిధులతో చేపడుతున్న విద్యా మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు సేవలందిస్తున్న భవిత కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన ఈ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు ఉన్న ప్రతి చిన్నారిని గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు కృషి చేయాలని, బడిబాట కార్యక్రమంలో కూడా ఈ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి నెల విద్యాశాఖ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని, ఉన్నత పాఠశాలల్లో సిలబస్ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వహించని ఉపాధ్యాయులపై, ముఖ్యంగా ఉన్నత పాఠశాలల్లో, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టు ఫోరమ్‌లను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.ఎం. షేక్, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌ని పర్యటించిన ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి బృందం

**ధర్మపురి, జూన్ 18, (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం ధర్మపురి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన వైస్ చైర్‌పర్సన్ ఇందారం రామన్న, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మరియు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మహేష్ ఆధ్వర్యంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో పర్యటించారు.

ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రాసెసింగ్ ప్లాంట్లను సందర్శించి, అక్కడ నిర్వహిస్తున్న శాస్త్రీయ విధానాలను పరిశీలించారు. డంపింగ్ ప్రక్రియ కాకుండా చెత్తను మూలం వద్దనే వేరు చేసి, ప్రాసెసింగ్ ద్వారా రీసైక్లింగ్ మరియు బయోమైనింగ్ పద్ధతుల ద్వారా, ఇనర్ట్ వ్యర్థాలు మరియు బయోసాయిల్ రూపంలో విలువైన ఉత్పత్తులుగా మార్చడం జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. అదేవిధంగా, లకారం చెరువు వద్ద చేపట్టిన సిటీ బ్యూటిఫికేషన్ అభివృద్ధి పనులు, రైతు బజార్,



స్ట్రీట్ వెండర్ జోన్లు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించి వాటి నిర్వహణ విధానాలను తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, సంబంధిత అధికారులు మరియు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఘన వ్యర్థాల నిర్వహణలో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను వివరించారు. ధర్మపురి మున్సిపాలిటీలో కూడా శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణతో పాటు పట్టణ సుందరీకరణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు త్వరలోనే ధర్మపురి పట్టణశీ లో చేపడుతామని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి తెలిపారు.



# నేడు పెద్దపల్లిలో కవిత పర్యటన...

## 'జెండా పండుగ' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి - టీఆర్‌ఎస్ జిల్లా ఇంఛార్జీ సలేంద్ర కొమరయ్య

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రక్షణ సేన (టీఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 'జెండా పండుగ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు టీఆర్‌ఎస్ శ్రేణులు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పార్టీ జిల్లా ఇంఛార్జి సలేంద్ర కొమరయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద టీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు.




అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. తదుపరి స్థానిక వ్యాపారులను ప్రోత్సహించే ఉద్దేశంతో మిలాన్ స్వీట్ హౌస్‌ను సందర్శించి స్వీట్లు కొనుగోలు చేయడంతో పాటు వ్యాపారులతో మమేకమవుతారని వివరించారు. అనంతరం జెండా చౌరస్తాలో టీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రసంగిస్తారని తెలిపారు. అక్కడి నుంచి పెద్దకాల్వ బస్టాండ్ చౌరస్తాకు చేరుకుని మరోసారి పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ధూళికట్టకు బయలుదేరుతారని చెప్పారు. పర్యటన సందర్భంగా ప్రజలతో మమేకమవుతూ పార్టీ భావజాలాన్ని, ఉద్యమ లక్ష్యాలను కవిత ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న 'జెండా పండుగ' కార్యక్రమానికి ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని సలేంద్ర కొమరయ్య యాదవ్ కోరారు. 'కవిత పర్యటనతో పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపబడుతుందని, ఉద్యమ స్ఫూర్తి మరింత బలోపేతం అవుతుందని' ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# పెద్దపల్లి జిల్లాలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

## ఉమ్మడి జిల్లా గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సర్వేలో భాగంగా బొంపల్లి గ్రామంలో గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేను గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే బొంపల్లి లో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను, గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతల గురించి, చదువు మానేసిన, ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు,ఉద్యోగం,స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో,ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలు , మరియు ఆన్లైన్ ఆర్డర్స్ ,ప్లాట్ఫారం వర్కర్స్, గిగ్గు వర్కర్స్ జొమాటో, స్విగ్గి, రాపిడో ,ఓలా, ఉబర్ వంటి ఆన్లైన్ ఆర్డర్స్ లో పనిచేసేటువంటి వ్యక్తుల యొక్క విషయాలను నమోదు చేసుకుంటామని తెలిపారు.కేంద్ర గణాక శాఖ నిర్వహిస్తున్న సర్వేలు నిరంతర పక్రియ కావున ప్రజలు అందరూ గణాంక శాఖ అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి గ్రామ సర్పంచ్ దాడి మౌనిక సంపత్ యాదవ్ ఉప సర్పంచ్ పంబాల రాజు, వార్డు సభ్యులు అంగన్వాడి టీచర్ కడారి కనక లక్ష్మి, గ్రామ ఏఎన్ఎం నగూరి రాజేశ్వరి, ఆశ వర్కర్ సంటి లలిత, గ్రామపంచాయతీ సిబ్బంది సంటి శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి

- అక్రమ ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు: సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్ టౌన్, జూన్18(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈరోజు ఉదయం కొత్తపల్లి మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపూర్ గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన 2 భారీ ఇసుక డంపులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించి, సీజ్ చేశారు. సీజ్ చేసిన ఈ రెండు డంపుల్లో మొత్తం 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమంగా తవ్వడం, నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై మైనింగ్ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# వనమహోత్సవంలో పాల్గొన్న నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి



**నల్గొండ ప్రతినిధి, జూన్ 18 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి గురువారం అనుముల మండల కేంద్రంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనుముల మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరిత



కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు. వనమహోత్సవం ద్వారా పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు.

# ఇందిరమ్మ గృహ పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ: ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి





**నల్గొండ ప్రతినిధి, జూన్ 18 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ గృహ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నాగార్జునసాగర్ నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ, హాలియా మున్సిపాలిటీని గుడిసెలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. నిరుపేదలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహ పథకాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం ఎంపికైన లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహ పథకం మంజూరు పత్రాలను పంపిణీ చేసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం...

● సన్నవడ్లకు బోనస్ ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే... ● వచ్చే పంట కాలానికి సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తాం

● రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఎరువులు రాష్ట్రానికే చెందాలి ● ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రైతులను కేంద్ర ప్రభుత్వం పట్టించు కోవడంలేదని, సన్నవడ్ల కు బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, వచ్చే పంట కాలానికి సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు. హైదరాబాద్ అసెంబ్లీ సీఎల్పీ కార్యాలయం లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు మాట్లాడుతూ ఇక్కడ ఉత్పత్తి అవుతున్న యూరియా ఎరువులను మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు రవాణా చేయడం వల్ల తెలంగాణలో కోరుత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్, మే మాసాలకు సంబంధించిన 47 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇంకా రాష్ట్రానికి రావాల్సి ఉందని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు ఇద్దరు ఏనాడు పట్టించుకోలేదని విజయ రమణారావు గారు తెలిపారు. రైతు గోస పేరిట యాత్రలు చేసిన బిజెపి నేతలకు యూరియా సమకూర్చే ఆలోచన లేదన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రైతు సమస్యలను ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రైతు గోస ఏమో కాని, బిజెపి నేతల గోసే చూస్తే జాలి వేస్తోందని చెప్పారు. గతంలో కేసీఆర్ సన్నవడ్ల కు ఎన్నడు బోనస్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సన్నవడ్ల కు ఇస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 2 వేల కోట్ల బోనస్ రైతులకు చెల్లించడం జరిగిందని చెప్పారు. అలాగే, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా వడ్ల కొనుగోళ్లు పూర్తి చేసినట్టు చెప్పారు. రాష్ట్రంలో 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించడం జరిగిందని చెప్పారు. మార్క్ఫెడ్ ద్వారా 15 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను సేకరించినట్టు చెప్పారు. ప్రభుత్వానికి మక్కల కొనుగోలు వల్ల నష్టం వచ్చినప్పటికీ రైతుల కోసం భరించడం జరిగిందన్నారు. సన్నవడ్ల కు మళ్లీ బోనస్ చెల్లించడం జరుగుతుంది అని స్పష్టం చేశారు. వరి పంట వేయవద్దని తమ ప్రభుత్వం ఏనాడు చెప్పలేదని, పంటల మార్పిడి వల్ల భూసారం పెరుగుతుందని అలాగే, పామాయిల్ తోటల పెంపకం లాభాసటి వ్యాపారం అని రైతులను చైతన్యం చేయడం జరిగిందని చెప్పారు. భవిష్యత్తు అవసరాల కోసం పామాయిల్ విత్తనాలను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోకుండా రాష్ట్రంలోని తోటల పెంపకం చేయాలని మాత్రమే రైతులకు చెప్పడం జరిగిందన్నారు. కేటీఆర్, హరీష్ రావులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఇద్దరు పోటీపడుతున్నారని చెప్పారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్







**ధర్మపురి, జూన్ 18, (ది క్రైమ్ న్యూస్):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. గురువారం ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. పర్యావరణం సమతుల్యంగా ఉంటే సకాలంలో వర్షాలు కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, రైతులకు మంచి దిగుబడులు లభిస్తాయని ఆయన తెలిపారు. పర్యావరణ అసమతుల్యత కారణంగానే ప్రస్తుతం వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి ప్రజలకు గుర్తు చేశారు. ప్రస్తుత తరంతో పాటు భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని పెంచి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దాలని మంత్రి అడ్లూరి పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ప్రజా ప్రతినిధులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు డీఎఫ్ఓ రవి ప్రసాద్, డీఆర్డీఓ రఘువరన్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అక్రమంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న నారాయణ, శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం

● పాలడుగు శ్రీనివాస్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ లీడర్



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ వ్యాప్తంగా నారాయణ, శ్రీ చైతన్య స్కూల్స్ దాదాపుగా 250 స్కూల్స్ లో అక్రమంగా అడ్మిషన్ల ఫీజు అధిక ఫీజులు అని పాఠ్య పుస్తకాలు డ్రెస్ ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులు దగ్గర లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తు దోపిడీకి పాల్పడుతున్నారు పైగా అదనంగా టెక్నో, ఒలంపియాడ్, ఇన్ఫినిటీ లెర్న్ వశిష్ట కో స్కూల్ స్ లాంటి పేర్లు పెట్టి దాదాపుగా తెలుగు రాష్ట్రాల్లోనే ఈ రెండు విద్యాసంస్థలో 80% పైగా విద్యార్థులు చదువుతున్నారు. విద్యను వ్యాపారంగా మార్చిన చరిత్ర వీళ్లదే అని చెప్పవచ్చు వీళ్లకు కమర్షియల్ కాంప్లెక్స్ లలో కూడా విద్యాశాఖ అధికారులు అనుమతులు ఇస్తారు వీళ్లకు తెలంగాణలో ఎంఈఓ నుండి మొదలు పాఠశాల కమిషనర్ వరకు డబ్బులతో మేనేజ్ చేసి అనుమతులు తెచ్చుకుంటారు. ఒక ప్లే గ్రౌండ్ ఉండదు, ఫైర్ సేఫ్టీ ఉండదు హాస్టల్స్ కి అనుమతులు అనేది విద్యాశాఖ పరిధిలోకి రాదు విద్యాశాఖ అధికారుల కు పిర్యాదు చేస్తే ఉమ్మడి రాష్ట్రంలో ఎడ్యుకేషన్ ఆక్ట్ లోనే హాస్టల్స్ కి అనుమతి ఇచ్చే అధికారం పాఠశాల విద్యాశాఖ కు గానీ ఇంటర్మీడియట్ బోర్డు గానీ అధికారాలు లేవు. విద్యాశాఖలో ఉన్న లోపాలను అడ్డుపెట్టుకొని ముఖ్యంగా ఈ నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థలు విచ్చల విడిగా అడ్డు అదుపు లేకుండా ఈ యాజమాన్యాలు బరితెగించి దోపిడీకి పాల్పడుతున్నరు. వీళ్లను అదుపు చేసే దమ్మున్న రాజకీయ నాయకుడు తెలంగాణలో లేడు కెసిఆర్ ప్రభుత్వం ఈ విద్యాసంస్థల ను బ్లాక్ మెయిల్ చేసి ఎలక్షన్ ఫండ్ తీసుకున్నారు, ప్రజాపాలన అని వచ్చిన కాంగ్రెస్ పార్టీ అదే తీరుగా ఉన్నది రేవంత్ రెడ్డి ముఖ్య మంత్రిగా విద్య శాఖ మంత్రిగా కేవలం పేపర్ ప్రకటనలకే స్కూల్స్ ఫీజు నియంత్రణ చేస్తాం అని టీవీ, పేపర్, సోషల్ మీడియా వేదిక ద్వారా ప్రచారం చేసుకుంటారు ప్రజాపాలనకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నికి చిత్త శుద్ధి ఉంటే ప్రత్యక జి,ఓ తీసుకొచ్చి తక్షణమే అమలు చేసి ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్ నేషనల్ స్కూల్స్, కాలేజీల యాజమాన్యాలు కు భయం పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలి రియల్ ఎస్టేట్ వ్యాపారులు విద్యా సంస్థలు ఏర్పాటు చేసి విచ్చల విడిగా ఇంటర్ నేషనల్ స్కూల్ స్థాపించి కోట్ల రూపాయలు విద్యా వ్యాపారంగా మార్చారు. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ వస్తుంది అనడానికి ఇదే నిదర్శనం తెలంగాణ పబ్లిక్ స్కూల్ అని తీసుకొచ్చారు కానీ ఏదో ఒక్క దగ్గర తీసుకొచ్చి మెరుగైన, నాణ్యమైన విద్యను అందిస్తాం అని చెప్పడం కాదు నిజంగా చిత్త శుద్ధి ఉంటే ప్రతి పాఠశాలను, ఆరుట్ల పాఠశాల, నల్గొండలో కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కొడుకు మీద ఏర్పాటు చేసిన స్కూల్స్ మాదిరి రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసే దమ్ము తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నప్పటికీ ఎందుకు ? ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారు విద్య, వైద్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విషయం ప్రజలకు తెలుసు అందుకే ప్రజల్లో మార్పు రావాలని ఓటు కు అమ్ముడు పోతున్న కాలం పాలకులు ప్రజలకు విద్య, వైద్యం అందనిద్రాక్షలాగానే ఉంటుంది ఇకనైనా ప్రజలు తమ ఓటు హక్కును ఒక్క రూపాయి తీసుకోకుండా ఉండాలి అప్పుడు మాత్రమే పాలకులను నిలదీసి ప్రభుత్వాన్ని నడిపే వాళ్ళను గల్లా పట్టుకుని ప్రశ్నించే రోజులు రావాలి అని కోరుకుంటున్నాను

# వాట్సాప్ స్టేటస్‌లో సెల్ఫీ వీడియో పెట్టి కార్పెంటర్ ఆత్మహత్య

- భార్య, బావమరిదితో గొడవ కారణంగానే తనువు చాలిస్తున్నట్లు సెల్ఫీ వీడియోలో వెల్లడి - తండ్రి నందయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు



**గోదావరిఖని క్రైమ్ (దిక్రైమ్ న్యూస్):** భూమి కొనుగోలుకు సంబంధించిన డబ్బుల విషయంలో భార్య, బావమరిదితో జరిగిన గొడవల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన పూనగంటి మధుకర్ (39) అనే కార్పెంటర్ వాట్సాప్ స్టేటస్‌లో సెల్ఫీ వీడియో పెట్టి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీస్ ఇన్స్పెక్టర్ సయ్యద్ అఫ్జలుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం, మేదరి బస్తీకి చెందిన మధుకర్ వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా భూమి కొనుగోలుకు డబ్బులు కట్టే విషయంలో అతని భార్య లావణ్య, ఆమె తమ్ముడు గణేష్‌లతో ఇంట్లో గొడవ జరుగుతోంది. ఈ క్రమంలో జూన్ 17 రాత్రి 11 గంటల 18 నిమిషాలకు మధుకర్ తన సెల్ఫోన్ లో సెల్ఫీ వీడియో రికార్డ్ చేసి, తన చావుకు భార్య, ఆమె తమ్ముడే కారణమని వాట్సాప్ స్టేటస్ పెట్టాడు. గమనించిన అతని తండ్రి నందయ్య, తమ్ముడు మాధవాచారి కలిసి వెంటనే మేదరి బస్తీలోని ఇంటికి వెళ్లి చూడగా మధుకర్ చీరతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 12 గంటల 15 నిమిషాలకు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుని తండ్రి నందయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

# చందమామలాంటి మచ్చలేని అందం మీసొంతం కావాలంటే ఉల్లి రసం ఇలా వాడండి..



జుట్టు ఆరోగ్యంగా పెరిగేందుకు చాలా మంది ఉల్లిపాయల రసాన్ని ఉపయోగిస్తారు. అయితే ఇది జుట్టుకే కాదు చర్మానికి కూడా మేలు చేస్తుంది. చర్మంపై ఏర్పడిన మచ్చలను తొలగించడంలో ఉల్లిపాయ ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఈ రోజుల్లో చాలా మంది ముఖంపై ఎర్రటి మచ్చల సమస్యతో బాధపడుతున్నారు. ఇది ముఖం అందాన్ని తగ్గిస్తుంది. చర్మంపై ఈ మచ్చలను తొలగించడం అంత సులభం కాదు. కానీ ఉల్లిపాయ ఆ పనిని సులభతరం చేస్తుంది. అయితే దీనికి ముందు, అసలు ఇలా ఎందుకు జరుగుతుందో మీరు తెలుసుకోవాలి? ముఖంపై ఎర్రటి మచ్చలు ఏర్పడటానికి అసలు కారణం చర్మంలో మెలనిన్ స్థాయి పెరుగుదల. శరీరంలో మెలనిన్ స్థాయిలు పెరిగడం వల్ల ఇలా జరుగుతుంది. మచ్చలను తొలగించడానికి ఉల్లిపాయ రసాన్ని క్రమం తప్పకుండా ఉపయోగించవచ్చు. ఉల్లిపాయ రసంలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ పిగ్మెంటేషన్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మంపై మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. మచ్చలను తొలగించడానికి ముందుగా.. 1 నుంచి 2 చెంచాల ఉల్లిపాయ రసాన్ని తీసుకోవాలి. కాటన్ సహాయంతో ఉల్లిరసాన్ని చర్మంపై ఎర్రగా ఉన్న ప్రదేశంలో అప్లై చేసి సున్నితంగా మసాజ్ చేయాలి. సుమారు 10 నిమిషాల పాటు మసాజ్ చేసిన తర్వాత ముఖం కడుక్కోవాలి. ఇలా రోజూ చేయడం వల్ల మచ్చల సమస్య నుంచి బయటపడవచ్చు. మచ్చలను తొలగించడానికి ఉల్లిపాయ రసంతోపాటు తేనెను కూడా ఉపయోగించవచ్చు. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది ముఖంపై మచ్చలను సులువుగా తగ్గిస్తుంది. 1 టీస్పూన్ ఉల్లిపాయ రసంలో కొద్దిగా తేనె కలపాలి. దీన్ని ముఖానికి పట్టించి 10 నిమిషాల పాటు అలాగే ఉంచి, తర్వాత నీళ్లతో ముఖాన్ని శుభ్రంగా కడిగేసుకుంటే సరి.

# ప్రతి విద్యార్థిలో ప్రాథమిక నైపుణ్యాల సాధన లక్ష్యంగా పనిచేయాలి

- ఎఫ్ఎల్ఎన్ "తొలిమెట్టు" కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- కాంప్లెక్స్ హెచ్ఎంలతో విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించిన
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, ప్రాథమిక గణితంలో కనీస నైపుణ్యాలను సాధించేలా లక్ష్యబద్ధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ కాంప్లెక్స్ హెచ్ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులకు తగిన శిక్షణ అందించి, ఎఫ్ఎల్ఎన్ "తొలిమెట్టు" కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పిల్లల్లో ప్రాథమిక నైపుణ్యాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. 2026–27 విద్యా సంవత్సరానికి ప్రతి కాంప్లెక్స్ స్థాయిలో లక్ష్యాలు నిర్దేశించుకోవాలని, ఆయా కాంప్లెక్స్‌ల పరిధిలోని ప్రతి పాఠశాలకు ప్రత్యేక లక్ష్యాలు నిర్ణయించి వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. పాఠశాలల్లో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అందరూ ఒక బృందంగా పనిచేసి ప్రాథమిక నైపుణ్యాల సాధన లక్ష్యాన్ని చేరుకోవాలని, విద్యా సంవత్సరం మొత్తం ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. గత ఏడాది జిల్లాకు మంచి ఫలితాలు వచ్చాయని, ఈ విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధిని ఉపాధ్యాయులు తమ బాధ్యతగా స్వీకరించాలని, పాఠశాలల్లో ఎదురయ్యే ఏ సమస్యనైనా ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే కాంప్లెక్స్ స్థాయిలో వర్క్ అడ్జస్ట్మెంట్ చేసుకుని, ఆ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, అకడమిక్ అధికారి పి.ఎం. షేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ధర్మపురి నృసింహుని సన్నిధిలో ప్రముఖ చలనచిత్ర నటుడు సాయి ధర్మ తేజ ప్రత్యేక పూజలు



**ధర్మపురి, జూన్ 18, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు ప్రముఖ హీరో మెగాస్టార్ చిరంజీవి మేనల్లుడు ప్రముఖ చలనచిత్ర నటుడు సాయి ధర్మ తేజ గురువారం స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థాన కార్య నిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం చిత్రవటం ఇచ్చి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వాహణాధికారి సంకటాల శ్రీనివాస్ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చార్యులు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి మరొకరికి గాయాలు



**నల్గొండ ప్రతినిధి, జూన్ 18 (ది క్రైమ్ న్యూస్):** హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొక వ్యక్తి గాయపడిన ఘటన విషాదాన్ని కలిగించింది. ఈ సంఘటనకు సంబంధించి హాలియా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అనుముల మండలం మదారిగూడెం గ్రామానికి చెందిన షేక్ ఉమర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అతని తండ్రి షేక్ నన్నే జానీ (67) మరియు గ్రామస్తుడు ఎడవెల్లి యెసోబు పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తుండగా, జూన్ 17న హాలియా-- మిర్యాలగూడ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఫిర్యాదు ప్రకారం, మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వీరిని వెనుక నుండి వచ్చిన ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే తీవ్ర గాయాలపాలైన షేక్ నన్నే జానీ చికిత్స పొందుతూ జూన్ 18న మరణించారు. మరోవైపు ఎడవెల్లి యెసోబు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రాథమిక విచారణలో ప్రమాదానికి హజారిగూడెం గ్రామానికి చెందిన ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ షేక్ మక్సూద్ కారణమైనట్లు ఫిర్యాదులో పేర్కొనబడింది. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, వాహనాల వేగం, డ్రైవింగ్ నిర్లక్ష్యం తదితర అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగుతోందని ఎస్సై సాయి ప్రశాంత్ వెల్లడించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల




**ధర్మపురి, జూన్ 18, (ది క్రైమ్ న్యూస్):** మృతుల కుటుంబాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు. ధర్మపురి పట్టణానికి చెందిన కొనపర్తి పద్మ, సంగి సత్తెమ్మ, జీదుల భూమన్న, ఎర్రోజుల గంగమ్మ ఇటీవలే వివిధ కారణాలతో మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలో మాజీ మంత్రి కొప్పుల వెంట పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వెంట ఉన్నారు.

# స్పోర్ట్స్

# యజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై స్పందించిన ధనశ్రీవర్మ..!

టీమిండియా క్రికెటర్ యజ్వేంద్ర చాహల్‌తో విడాకులపై ఆయన మాజీ భార్య, ప్రముఖ కొరియోగ్రాఫర్ ధనశ్రీ వర్మ తొలిసారిగా స్పందించారు. విడాకుల సమయంలో కోర్టులో ఎదుర్కొన్న మానసిక వేదనను, ఆ తర్వాత జరిగిన టీ-షర్ట్ వివాదాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కోర్టులో తీర్పు వెలువరించే సమయంలో ఆమె తన భావోద్వేగాలను కంట్రోల్ చేయలేక, అందరితో కలిసి కన్నీళ్లు పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో ధనశ్రీ మాట్లాడింది. 'విడాకుల రోజున మేమిద్దరం కూడా మానసికంగా సిద్ధమయ్యే ప్రయత్నం చేసాం. కానీ, తీర్పు ఇవ్వబోతున్నప్పుడు, నా భావోద్వేగాలను అదుపు చేయలేకపోయాను. ఆ క్షణంలో నేను ఎంత బాధపడుతానో చెప్పలేక ఒక రకంగా ఏడ్చేశాను. ఆ తర్వాత చాహల్ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు' అని చెప్పింది. విడాకుల సమయంలో చాహల్ ధరించిన 'బీ యువర్ ఓన్ షుగర్ డాడీ' అని రాసి ఉన్న టీ-షర్ట్ పెద్ద వివాదాన్ని రేపింది. దీనిపై ధనశ్రీ స్పందిస్తూ 'ఈ విషయంలో ప్రజలు నన్నే నిందిస్తారని మేం ముందే ఊహించాం. టీ-షర్ట్ గురించి తెలిసేలోపే.. నాపై నిందలు మోపుతారనే అభిప్రాయం ఏర్పడింది' అని తెలిపింది. కోర్టు నుంచి బయటకు వచ్చిన తర్వాత చాహల్ టీ-షర్ట్‌కి సంబంధించిన వీడియోలను చూసి ఆమె ఆశ్చర్యపోయానని చెబుతూ.. 'అరే, వాట్సాప్‌లో చెప్పొచ్చు కదా! అలా ఎందుకు వేసుకున్నాడో?' అని ఆమె వ్యాఖ్యానించారు. ఇలాంటి సున్నితమైన విషయాలను ఎంతో పరిపక్వతతో చూసుకోవాలని భావించానని అన్నారు. 'ప్రజలను ఆకట్టుకోవడం కోసం అనాలోచిత వ్యాఖ్యలు చేయడం నాకు ఇష్టం లేదు. మా కుటుంబ విలువలను, అతని కుటుంబ





గౌరవాన్ని కాపాడాలనే భావనతోనే అలా స్పందించాను' అని పేర్కొన్నారు. సమాజంలో మహిళల పరిస్థితిని వివరిస్తూ 'మహిళగా, బంధాన్ని నిలబెట్టుకోవాలని, అన్నింటినీ మినహాయించుకొని జీవనం సాగించాలని మనం నేర్చుకుంటాం. మన తల్లులు ఎంతో గౌరవంగా ఆ మాటలు చెప్పినట్లయితే, అది నిజమే' అని తెలిపారు. పెళ్లి బంధంలో ఉన్నప్పుడు, తన భర్త చాహల్‌కు తాను అండగా నిలిచానని, చిన్న చిన్న విషయాల నుంచి పెద్ద విషయాల వరకు అతనితో అంగీకారంగా ఉంటూ ఎప్పుడూ కృషి చేశానని ధనశ్రీ గుర్తు చేసుకున్నారు. చాహల్, ధనశ్రీ వర్మ 2020లో వివాహం చేసుకున్న తర్వాత ఐదేళ్ల వివాహ బంధం ముగియడంతో ఈ విడాకులు తీసుకున్న విషయం ఇటీవల వార్తల్లో నిలిచింది.

## రోకో లేకుండానే భారత జట్టు.. 1

7 ఏళ్లలో ఇదే తొలిసారి..! 2008 నుంచి ఇప్పటి వరకు టీమ్ ఇదే.. ఆసియా కప్ టోర్నీ వచ్చే నెలలో మొదలుకానున్నది. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు టీ20 ఫార్మాట్‌లో జరుగనుండగా.. అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా భారత్-పాకిస్తాన్ మధ్య జరిగే హైవోల్టేజ్ మ్యాచ్ కోసం నిరీక్షిస్తున్నారు. టోర్నమెంట్ షెడ్యూల్ ప్రకారం ఈ మ్యాచ్ సెప్టెంబర్ 14న దుబాయ్‌లో జరగనుంది. అయితే, భారత జట్టు ఈ మ్యాచ్ ఆడుతుందో.. లేదో ఇంకా స్పష్టత రాలేదు. అదే సమయంలో, సెప్టెంబర్ 10న యుఏఈతో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. 2008 తర్వాత భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పేరు లేకపోవడం ఇదే మొదటిసారి. 17 సంవత్సరాల తర్వాత వారిద్దరు లేకుండానే జట్టు ఈ టోర్నమెంట్ ఆడనుంది. 2008 నుంచి ఇప్పటి వరకు భారత జట్టు ఎంతగా మారిపోయిందో ఓ లుక్కేద్దాం రండి..!

### 2008లో కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. రోహిత్‌కు ఇదే తొలి ఆసియా కప్..

2008లో ఆడిన ఆసియా కప్‌లో మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్‌గా ఉన్నాడు. ఇది రోహిత్ శర్మకు తొలి ఆసియా కప్. ఆ ఎడిషన్‌లో విరాట్ జట్టులో లేడు. యువరాజ్ సింగ్ వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆ ఎడిషన్‌లో, టీమ్ ఇండియా ఫైనల్‌కు చేరుకుంది. అయితే, శ్రీలంక చేతిలో 100 పరుగుల తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. 2010లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌కు కూడా ధోనీ కెప్టెన్‌గా వ్యవహరించాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరూ ఆ ఎడిషన్‌లో జట్టులో ఉన్నారు. అయితే, జట్టుకు ఎవరినీ వైస్ కెప్టెన్‌గా నియమించలేదు. 2010లో ఫైనల్‌లో శ్రీలంకను 81 పరుగుల తేడాతో ఓడించి భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. 2012లో వన్డే ఫార్మాట్‌లో ఆడిన ఆసియా కప్‌లో ధోనీ కెప్టెన్‌గా ఉన్నాడు. విరాట్ కోహ్లీకి వైస్ కెప్టెన్సీ బాధ్యత అప్పగించారు. రోహిత్ శర్మ కూడా జట్టులో ఉన్నాడు. 2012లో సెమీ-ఫైనల్స్‌లో ఓడిపోవడంతో భారత జట్టు ఎలిమినేట్ అయ్యింది. ఫైనల్‌లో బంగ్లాదేశ్‌ను రెండు పరుగుల తేడాతో ఓడించి పాక్ టైటిల్ గెలిచింది.

## ఆసియా కప్‌కు జైస్వాల్‌ను ఎంపిక చేయకపోవడం అన్యాయం

### మాజీ స్పిన్నర్ ఆర్ అశ్విన్



ఆసియా కప్ 2025 కోసం భారత టీ20 జట్టును ప్రకటించిన తర్వాత, సెలక్షన్ కమిటీ నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి ఎంపిక చేయకపోవడం టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఆశ్చర్యకరంగా ఉందని.. నిరాశ కలిగించిందని పేర్కొన్నాడు. జైస్వాల్‌ను ఇలా పక్కన పెట్టడం అన్యాయంగా అభిప్రాయపడ్డాడు. అద్భుతంగా ప్రదర్శిస్తున్న ఆటగాడికి ఇలాంటి అన్యాయం జరిగితే ఆటతీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన తెలిపాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా తీసుకుని జట్టులోకి తీసుకోగా.. జైస్వాల్‌ను జట్టు నుంచి తప్పించింది. ఈ నిర్ణయం పై అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పందించారు. 'జట్టు కోసం నిస్వార్థంగా ఆడే యువ ఆటగాడు జైస్వాల్. ఇలా తప్పించబడడం చాలా బాధాకరం.



## చిక్కుల్లో పాకిస్తాన్ మాజీ కెప్టెన్..



**వసిం అక్రమ్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు..**

పాకిస్తాన్ మాజీ కెప్టెన్ వసిం అక్రమ్ చిక్కుల్లో పడ్డాడు. గ్యాంబ్లింగ్, బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌కు ప్రచారం చేస్తున్న మాజీ బౌలర్‌పై సైబర్ క్రైమ్ ఏజెన్సీకి ఫిర్యాదు చేశారు. జూదం, బెట్టింగ్ యాప్స్‌ను ప్రోత్సహిస్తున్న అక్రమ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముహమ్మద్ ఫైజ్ లాహోర్‌లోని నేషన్ సైబర్ క్రైమ్ ఏజెన్సీ(%చీజజ×ూ%)కి ఫిర్యాదు చేశాడు. విదేశీ బెట్టింగ్ యాప్ 'బాజీ'తో అక్రమ్‌కు సంబంధం ఉందని ఫైజ్ ఆరోపించారు. పాకిస్తాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ ఈ బెట్టింగ్ యాప్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నాడన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ అయిన పోస్టర్, వీడియో క్లిప్‌లో వసీం అక్రమ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌కు మద్దతు తెలుస్తోందని.. ఇది యాప్‌పై సాధారణ ప్రజల్లో ఆసక్తిని పెంచిందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ క్రైమ్స్ యాక్ట్ 2016 కింద అక్రమ్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫైజ్ సైబర్ క్రైమ్ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశాడు. ఇదిలా ఉండగా.. భారత్‌లో బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన పలువురు సెలబ్రిటీలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రశ్నిస్తున్నది. అక్రమ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన అనేక కేసులను ఏజెన్సీ దర్యాప్తు చేస్తోంది. చాలామంది పెట్టుబడిదారులను రూ.కోట్లల్లో మోసం చేయడం, పెద్ద మొత్తంలో పన్ను ఎగవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఆ యాప్‌కు సంబంధించిన ప్రకటనల్లో పాల్గొన్న వ్యక్తులు, ముఖ్యంగా సినీతారలు, క్రికెటర్లపై ఈడీ చర్యలు చేపడుతున్నది. ఈ కేసులో ఈడీ చాలా మంది నటీనటులు, ప్లేయర్స్‌ను ప్రశ్నించింది. ఈ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్ ప్రజల నుంచి డబ్బును దోచుకుంటున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లు తమను తాము నాలెడ్జ్ ఆధారిత గేమింగ్‌గా చూపించుకుంటాయని, కానీ నకిలీ అల్గారిథమ్‌ల ద్వారా అక్రమ బెట్టింగ్‌ను ప్రోత్సహిస్తాయని దర్యాప్తులో వెల్లడైంది.

## మను భాకర్‌కు కాంస్యం.. ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్

షిమ్కెంట్(కజకిస్థాన్): ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో డబుల్ ఒలింపియన్ మను భాకర్ కాంస్య పతకంతో మెరిసింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్లో మను భాకర్ 219.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో క్వియాన్కె మా(చైనా, 243.2), జిన్ యాంగ్(కొరియా, 241.6) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. మహిళల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లోనూ మను భాకర్(583), పాలక్(573), సురుచిసింగ్(574)తో కూడిన భారత త్రయం కాంస్యం ఖాతాలో వేసుకుంది. మరోవైపు మహిళల జూనియర్ పిస్టల్ ఈవెంట్‌లో యువ షూటర్ రశ్మిక సెహగల్ 241.9 పాయింట్లతో స్వర్ణంతో మెరిసింది. అదే దూకుడు కొనసాగిస్తూ టీమ్‌ఈవెంట్‌లోనూ రశ్మిక(582), వంశిక చౌదరీ (573), మోహిని సింగ్(565)త్రయం పసిడి కైవసం చేసుకుంది. టోర్నీలో ఇప్పటి వరకు భారత్ ఐదు స్వర్ణాలు సహా రెండు రజతాలు, నాలుగు కాంస్య పతకాలతో కొనసాగుతున్నది.




# ఆసియా కప్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు దక్కని చోటు..

**అసంతృప్తిని వ్యక్తం చేసిన అభిషేక్ నాయర్**

వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరుగనున్న ఆసియా కప్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చోటు కల్పించకపోవడంపై అందరినీ ఆశ్చర్యపరిచింది. ఛాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటిన, ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు నడిపించిన అయ్యర్‌కు 15 మంది సభ్యుల జట్టులోనే కాకుండా, ఐదుగురు స్టాండ్‌బై ఆటగాళ్ల జాబితాలో కూడా చోటు దక్కలేదు. దాంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బీసీసీఐ నిర్ణయంపై టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'శ్రేయస్ అయ్యర్ లాంటి స్టార్ ఆటగాడు కనీసం రిజర్వ్ ఆటగాళ్ల జాబితాలో కూడా ఎలా లేడో నాకు అర్థం కావడం లేదు. అతడిని 20 మందితో కూడిన జట్టులో ఎందుకు తీసుకోలేదో తెలియడం లేదు. ఈ నిర్ణయం అతనికి జట్టులో ప్రాధాన్యత ఇవ్వడం లేదు అనే స్పష్టమైన సంకేతం ఇస్తుంది' అని పేర్కొన్నాడు. సెలక్షన్ అనేది కేవలం ఆటగాడి ప్రతిభను మాత్రమే కాకుండా, కొంతమంది వ్యక్తుల ఇష్టాలకు ఆధారపడి ఉండవచ్చని నాయర్ వ్యాఖ్యానించాడు. అయితే, జట్టులో చోటు కల్పించకపోవడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పందించారు. 'శ్రేయస్ తప్పేమీ లేదు. తాము కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. ప్రస్తుతానికి అతను తన అవకాశం



కోసం ఎదురు చూడాల్సిందే' అని కామెంట్ చేశాడు. అలాగే, అభిషేక్ శర్మ బౌలింగ్ చేయగల సామర్థ్యం ఉన్న ఆటగాడు కావడంతో యశస్వి జైస్వాల్ వంటి ఆటగాడిని పక్కన పెట్టడం అనివార్యమైందని అగార్కర్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ 17 మ్యాచ్‌లలో 175.07 స్ట్రయిక్ రేట్‌తో 604 పరుగులు చేసి, అత్యధిక స్కోరర్ చేసిన ఆరో ప్లేయర్‌గా నిలిచాడు. ఫుల్ ఫామ్‌లో ఉన్న ఆటగాడిని కీలకమైన టోర్నమెంట్‌కు ఎంపిక చేయకపోవడంపై క్రీడా వర్గాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


# విశ్వజి



## కొబ్బరి నీళ్లు ఎన్ని తాగాలి?

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలని అందరికీ తెలిసిందే. ఎవరికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా%ా% కొబ్బరి నీళ్లు తాగమని సలహా ఇస్తుంటారు. రోగాలతో ఉన్నవాళ్లకే కాదు ఆరోగ్యంగా ఉన్నవాళ్లకూ ఇందులో ఉండే పోషకాలు అవసరమే. అయితే, అధికంగా పోషకాలు ఉండే కొబ్బరి నీళ్లను ఎన్ని తాగాలి? ఎన్నిసార్లు తాగాలో అవగాహన తక్కువే! పరిమితిని మించితే ఔషధం కూడా వికటిస్తుంది. ఎక్కువ మోతాదులో లవణాలు ఉండే కొబ్బరి నీళ్లను పరిమితంగా తాగడమే మేలని చెబుతున్నారు నిపుణులు. కొందరైతే.. కొబ్బరినీళ్లు లీటర్ బాటిల్ కొని గటగటా తాగేస్తుంటారు. ఇంకొందరు రెండుసార్లు విరామం ఇస్తూ లీటర్ పట్టిస్తారు. అన్నేసి కొబ్బరినీళ్లు తాగితే.. కిడ్నీలు, ఇతర అవయవాలపై భారం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి 150-200 మిల్లీలీటర్లు తాగితే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఆరోగ్యవంతులు వారంలో మూడు నుంచి నాలుగుసార్లు కొబ్బరినీళ్లు తాగొచ్చు. అది కూడా ఉదయం, సాయంత్రాల్లో శారీరక శ్రమ చేసిన తర్వాత లేదా వ్యాయామం ముగించిన తర్వాత కొబ్బరి నీళ్లు తాగడం మేలు! కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం రక్తపీడనాన్ని నియంత్రణలో ఉంచుతుంది. శరీరానికి కావాల్సిన గ్లూకోజ్‌ను వేగంగా అందిస్తుంది. కాళ్ల తిమ్మిర్లు తగ్గిస్తుంది.

## మఖానా.. మంచిదేనా?



'ఫూల్ మఖానా'ను చాలామంది హెల్దీ స్నాక్స్‌గా తీసుకుంటున్నారు. శరీరానికి కావాల్సిన ప్రొటీన్, ఫైబర్, యాంటి ఆక్సిడెంట్లను పొందుతున్నారు. ఆరోగ్యానికి భరోసానిచ్చే ఈ తామర విత్తనాలు.. కొందరికి మాత్రం హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్నిరకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు.. 'మఖానా'కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. గర్భిణులు మఖానాను పరిమితంగానే తీసుకోవాలి. వీటిని ఎక్కువగా తీసుకుంటే.. శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది. దాంతో అసౌకర్యం ఏర్పడుతుంది. కాబట్టి, వైద్యుడిని సంప్రదించిన తర్వాతే.. మఖానాను తినాలి. కిడ్నీ సమస్యలతో బాధపడేవారికి.. మఖానా మంచిది కాదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. మూత్రపిండాల సమస్య ఉన్నప్పుడు.. శరీరంలో పొటాషియం స్థాయిలు పెరుగుతాయి. దీర్ఘకాలంలో గుండె సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి, కిడ్నీరోగులు 'మఖానా' ముట్టకుంటేనే బెటర్! మఖానా తింటే కొందరిలో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే ఫైబర్.. కొన్నిసార్లు గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను సృష్టిస్తుంది. అల్సర్, గుండెల్లో మంట, ఇతర జీర్ణ సమస్యలుంటే.. మఖానాను పక్కన పెట్టేయాలి. కొందరిలో 'మఖానా' అలెర్జీలకు దారితీస్తుంది. చర్మంపై దద్దుర్లు, దురద, ఇతర ఇన్‌ఫెక్షన్లు కనిపిస్తాయి. మఖానా తిన్నప్పుడు ఏదైనా అలెర్జీ వచ్చినట్లయితే.. వీటికి దూరంగా ఉండాలి. తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. మఖానాలో కార్బోహైడ్రేట్లు అధిక మొత్తంలో లభిస్తాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారు వీటికి దూరంగా ఉండటమే మంచిది. వైద్యుడి సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి.


## మద్యం కన్నా లివర్‌కు ఈ ఆహారాలతోనే డేంజర్..!!





కాలేయం. మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో ఒకటి. కాలేయం మన శరీరంలో అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. ఇది విషకారకాలను తొలగించేందుకు, గ్లైకోజెన్, విటమిన్లు, ఖనిజాల నిల్వలో సహాయపడుతుంది. ఇది రక్తాన్ని శుభ్రపరుస్తుంది. పోషకాలను ప్రాసెస్ చేస్తుంది. కాలేయం ఆరోగ్యంగా ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండటం అవసరం. మరి, కాలేయానికి మంచి శక్తి.. ఆరోగ్యం ఉండాలంటే కొన్ని ప్రమాదకరమైన ఆహారాలకు దూరంగా ఉండాలి. ఈ మధ్య కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లతో లివర్ సమస్యలు పెరుగుతున్నాయి. ఫ్యాటీ లివర్ సర్వసాధారణంగా మారుతోంది. ఆ తరువాత సరైన జాగ్రత్తలు తీసుకోని కారణంగా ఆ సమస్యే క్యాన్సర్ గా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మరణాలకు లివర్ క్యాన్సర్ కూడా ఒక ప్రధాన కారణంగా గుర్తించారు. వేగంగా మారుతున్న జీవనశైలి, ఆహారంలో అజాగ్రత్తలు కాలేయాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ రోజుల్లో, ఫ్యాటీ లివర్, సిర్రోసిస్ వంటి అనేక కాలేయ సంబంధిత సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కాలేయ క్యాన్సర్‌కు అత్యంత సాధారణ కారణం హెపటైటిస్ బి, సి వైరస్ ఇన్ఫెక్షన్. కానీ కొన్ని జీవనశైలి కారణాల వల్ల ఈ వ్యాధి బారిన పడి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని ఆహార పదార్థాలు మద్యం కంటే ఎక్కువగా కాలేయానికి నష్టం చేస్తాయని పరిశోధనలు తేల్చి చెబుతున్నాయి. ప్రాసెస్ చేసిన మాంసంలో అధిక మొత్తంలో ఇనుము, సంతృప్త కొవ్వులు ఉంటాయి. దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. ఇది కాలేయ క్యాన్సర్‌తో నేరుగా ముడిపడి ఉంటుంది. ఎక్కువ మొత్తంలో ఆల్కహాల్ తీసుకోవడం కూడా కాలేయంలో క్యాన్సర్ పెరుగుదలను ప్రేరేపిస్తుంది. మొదట ఫ్యాటీ లివర్ సమస్యకు కారణమై క్రమంగా క్యాన్సర్ సమస్యగా మారుతుంది. చక్కెర ఎక్కువగా తింటే డయాబెటిస్ మాత్రమే కాకుండా క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. జంక్ ఫుడ్స్ రోజూ తీసుకోవడం కాలేయానికి హానికరం. ఇది నాన్ ఫ్యాటీ లివర్ ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక ఉప్పు కాలేయ వాపు తీవ్రతరం చేస్తుంది. ధూమపానం, రెడ్ మీట్ కూడా లివర్ క్యాన్సర్ కు కారణంగా నిలుస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అటుకుల్లో ఇన్ని బెనిఫిట్స్ ఉన్నాయా?



అటుకులు అని తేలిగ్గా తీసుకుంటాం గానీ ఇందులో అనేక పోషకాలు ఉన్నాయి. అల్పాహారంగా, సాయంత్రం వేళ.. చిరుతిండిగా అటుకుల (పోహా)ను తింటుంటారు. తక్కువ కేలరీలు కలిగి ఉండటం దీని ప్రత్యేకత. బరువు తగ్గాలనుకునేవారికి పోహా ఒక దివ్యౌషధం. అద్భుతంగా పని చేస్తుందిది. ఇందులో ఐరన్, ఫైబర్, విటమిన్లు వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. క్యారెట్, బఠానీలు, వేరుశెనగలు, కరివేపాకు వంటి వాటిని చేర్చుకుంటే పోహాను మరింత రుచికరంగా తయారవుతుంది. భుజియా, చట్నీతో కలిపి తింటే రుచి మరింత పెరుగుతుంది. పోహా వల్ల ఆరోగ్య ప్రయోజనాలను కూడా ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: పోహాలో ఉండే ఫైబర్, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఇది నెమ్మదిగా, స్థిరంగా షుగర్ కంటెంట్ ను విడుదల చేస్తుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయి స్థిరంగా ఉంటుంది. ఆకస్మిక పెరుగుదలను నివారించినట్టవుతుంది. డయాబెటిస్ తో బాధపడే వారికి ఇదో బెస్ట్ ఆప్షన్. తక్కువ కేలరీలు: బరువు తగ్గడానికి పోరాడుతున్న వారికి పోహా ఒక గొప్ప ఆహారం. తక్కువ కేలరీలు కలిగి ఉండటంతో పాటు, ఇందులో సుమారు 76.9% కార్బోహైడ్రేట్లు, తక్కువ కొవ్వు శాతం ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి అనువైనది. పోహాలోని ఫైబర్ కడుపును నిండుగా ఉంచుతుంది, అతిగా తినడాన్ని తగ్గిస్తుంది. ఐరన్ పుష్కలం: పోహాను ఎండబెట్టి, రోలర్లతో చదును చేసేటప్పుడు, అది కొంత ఐరన్‌ను గ్రహిస్తుంది. ఇది శరీరంలో ఐరన్ లోపాన్ని నివారించడంలో సహాయపడుతుంది. గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు కూడా ఇది మంచి ప్రయోజనకరం. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో పోహ (అటుకులు) గ్లైసెమిక్ ఇండెక్స్ సహాయపడుతుంది. పోహాలోని ఫైబర్ జీర్ణక్రియకు తోడ్పడటమే కాకుండా, నిమ్మరసం కలపడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. నిమ్మరసం రోగనిరోధక శక్తిని, చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించే విటమిన్ సి కి మంచి వనరు. పోహాలో పిండి పదార్థాలు ఉండటం వల్ల.. దీన్ని తగిన మోతాదులో తీసుకోవడం చాలా ముఖ్యం. పోహను సమతుల్య ఆహారంలో భాగంగా చేర్చుకోవాలి కానీ, దీనిపైనే పూర్తిగా ఆధారపడకూడదు. మార్కెట్లో లభించే రెడీమేడ్ పోహ మిక్స్‌లలో చక్కెర, సోడియం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి, ఇంట్లో తయారుచేసుకున్నవి లేదా జాగ్రత్తగా ఎంచుకున్న వాటిని వాడటం మంచిది. పోహ పోషక విలువలను పెంచడానికి కూరగాయలు, పప్పులు, లేదా ఉడికించిన గుడ్లు జోడించవచ్చు. గుండె ఆరోగ్యానికి మేలు చేసే బాదం, అవిసె గింజలు వంటి నట్స్, గింజలను పోహపై చల్లుకోవడం వల్ల ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. రుచి కోసం, అలాగే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, జీవక్రియను పెంచే లక్షణాల కోసం పోహాలో పసుపు, జీలకర్ర, కారం పొడి వంటివి కలపవచ్చు.

# మార్కెట్

## పెరిగిన భారత్ ఫారెక్స్ నిల్వలు..

### బంగారం నిల్వలు ఎన్ని బిలియన్లకు చేరాయంటే..?

జులై 25తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 2.703 బిలియన్లు పెరిగి 698.192 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. గత వారంలో నిల్వలు 1.183 బిలియన్లు తగ్గి 695.489 బిలియన్లకు పడిపోయాని పేర్కొంది. విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 588.926 బిలియన్లకు పెరిగాయి. ఆర్‌బీఐ డేటా ప్రకారం.. విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 1.316 బిలియన్లు పెరిగి 588.926 బిలియన్లకు చేరుకున్నాయి. ఈ వారంలో బంగారం నిల్వలు 1.206 బిలియన్లు పెరిగి 85.704 బిలియన్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 126 మిలియన్ డాలర్లు పెరిగి 18.809 బిలియన్లకు చేరుకున్నాయని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి లో భారతదేశం రిజర్వ్ స్థానం 55 మిలియన్ డాలర్లు పెరిగి 4.753 బిలియన్ డాలర్లకు చేరుకుంది.



## బంగారం కొనుగోలుదారులకు గుడ్‌న్యూస్..

### మళ్లీ ధర ఎంత తగ్గిందంటే..?



బంగారం కొనుగోలుదారులకు గుడ్‌న్యూస్. వరుస సెషన్‌లో ధరలు దిగి వస్తున్నాయి. స్టాకిస్టుల అమ్మకాల నేపథ్యంలో ధరలు పడిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.400 తగ్గి తులానికి రూ.97,620కి చేరుకుంది. ఇక 22 క్యారెట్ల పసిడి ధర రూ.300 తగ్గి తులానికి రూ.97,500 పడిపోయింది. అదే సమయంలో వెండి సైతం భారీగా తగ్గుముఖం పట్టింది. కిలోకు రూ.2500 పతనమై.. రూ,1,09,500కి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. అంతర్జాతీ మార్కెట్‌లో బంగారం ప్రస్తుతం ఔన్స్‌కు 3,290 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. స్పాట్ గోల్డ్ 0.12శాతం పెరిగి ఔన్స్‌కు 3,294.31 డాలర్లకు చేరుకుంది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ వైస్ ప్రెసిడెంట్, పరిశోధన విశ్లేషకుడు జతిన్ త్రివేది మాట్లాడుతూ.. ఈ తగ్గుదల అమెరికా ఫెడరల్ రిజర్వ్ దూకుడు.. సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్లను తగ్గించే సూచనలు లేకపోవడం వల్లేనన్నారు. దాంతో బంగారం పెట్టుబడి ఆస్తులపై సెంటిమెంట్ తగ్గిందన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ మాట్లాడుతూ వారంలో చివరిరోజున బంగారం ప్రతికూల ధోరణి ఉంటుందని.. వారంలో తగ్గుదలతోనే మార్కెట్ ముగుస్తుందన్నారు. డిమాండ్ తగ్గడం, యూఎస్ డాలర్ రికవరీ కారణంగా ధర తగ్గిందని చెప్పారు. ఈ వారం ఇప్పటి వరకు 2శాతానికి పెరిగి తొమ్మిది వారాల గరిష్టానికి చేరుకుందని పేర్కొన్నారు. సుంకాల అనిశ్చితి కారణంగా మార్కెట్‌లో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లోని ప్రెషియస్ మెటల్స్ రీసెర్చ్ అనలిస్ట్ మానవ్ మోదీ పేర్కొన్నారు. యూఎస్ వ్యవసాయేతర వేతన డేటాపై పెట్టుబడిదారుల దృష్టి కేంద్రీకరించడంతోపాటు సెంట్రల్ బ్యాంకు వడ్డీ రేట్లను 4.25శాతం నుంచి 4.50శాతం పరిధిలోనే కొనసాగించనుందనే అంచనాలున్నాన్నారు. ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలు సైతం సెప్టెంబర్‌లో వడ్డీ రేట్లను తగ్గింపు ఆశలుపై నీళ్లు చల్లినట్లయ్యింది. మార్కెట్‌పై అమెరికా వ్యవసాయేతర డేటా, సుంకాల సంబంధిత నిర్ణయాలపై దృష్టి సారిస్తుందని ఆయన పేర్కొన్నారు.



## నష్టాల్లో ముగిసిన సూచీలు.. సెన్సెక్స్ 81వేల దిగువకు సెన్సెక్స్..

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 585 పాయింట్లు పతనం కాగా.. నిఫ్టీ 203 పాయింట్లు పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన సుంకాల నేపథ్యంలో మార్కెట్ల పతనం కొనసాగుతోంది. అమెరికా సుంకాల అమలును మరో వారం పొడిగించిన నేపథ్యంలో మార్కెట్‌ల నష్టాల్లో మొదలైంది. చివరి వరకు కోలుకోలేకపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,074.41 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,317.51 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,495.57 కనిష్టానికి తగ్గింది. చివరకు 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 203 పాయింట్లు పతనమై.. 24,565.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1264 షేర్లు లాభపడగా.. 2582 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా స్టీల్, సిప్లా నష్టపోయాయి. లాభపడిన వాటిలో ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, హీరో మోటోకార్ప్, హెచ్‌యూఎల్, నెస్లే ఉన్నాయి. ఎఫ్‌ఎంసీజీ మినహా, అన్ని ఇతర రంగాల సూచీలు ఆటో, రియాల్టీ, ఫార్మా, ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, టెలికాం 0.5-2 శాతం క్షీణించి నష్టాల్లో ముగిశాయి.

# ఆంధ్రప్రదేశ్

## అబద్దాలు చెప్పడం, మోసాలు చేయడం అలవాటే

### అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ పార్టీ పని

### మండిపడ్డ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఒంగోలు,జూన్18 : మోసం చేయడం, అబద్దాలు చెప్పడం జగన్ రెడ్డి పార్టీకే సొంతమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లాలో గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. 'నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఇచ్చిన హామీలతోపాటు అభివృద్ధి చేసి చూపించడంతో కూటమిపై ప్రజల్లో నమ్మకం ఏర్పడింది. పెన్షన్ల కోసం రూ.33 వేల కోట్ల ఖర్చు పెడుతున్నాం. విద్య కోసం రూ.10 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం' అని అన్నారు. వైసీపీకి ఒక్క ఓటు వేసిన పాపానికి ఆంధ్రప్రదేశ్ ఐదేళ్లు నాశనమైందనిఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఇచ్చిన ఐదేళ్లు వైఎస్ జగన్ ఇంట్లో నిద్రపోయారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాము చేస్తున్న అభివృద్ధిని తన ఖాతాలో వేసుకోవాలని జగన్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక తట్ట మట్టి కూడా వేయలేదని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. నాడు ఒక్క ప్రాంతంలోనూ రహదారి నిర్మాణం చేపట్టలేదని, వెలిగొండ లాంటి ప్రాజెక్టు అభివృద్ధిని కూడా అడ్డుకున్నారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశానంటూ ప్రజలను మోసం చేశారంటూ జగన్‌పై గొట్టిపాటి విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రతి నెలా వెలిగొండ ప్రాజెక్టును పరిశీలిస్తున్నారని మంత్రి తెలిపారు. వెలిగొండ ముంపు గ్రామాల ప్రజలకు రూ.900 కోట్ల నిధులు మంజూరు చేశారని వివరించారు. రాబోయే రోజుల్లో కూటమిలోని పార్టీల నేతలు ఇంటింటికీ తిరిగి ప్రజలతో మమేకమవుతారని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి చెప్పారు.

## టిఎంసికి హైకోర్టులో ఎదురుదెబ్బ

### రితబ్రత బెనర్జీ నియామకంపై సవాల్

### మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు

కోల్‌కతా,జూన్18 : తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు. కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ, ఆమె మేనల్లుడైన అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా ఓ చీలిక వర్గాన్ని ఏర్పాటు చేశారు రితబ్రత. అయితే.. తిరుగుబాటు వర్గం వాదనను అంగీకరిస్తూ రితబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ నియమించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. స్పీకర్ నిర్ణయం అధికారికంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీని పక్కనపెట్టిందని, శాసనసభ పార్టీల గుర్తింపును నియంత్రించే రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించిందని వాదిస్తూ.. దీదీ వర్గం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

### కెటిఆర్ సిరిసిల్లకు విజిటింగ్ టూరిస్ట్

### టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

కరీంనగర్,జూన్ 18 : ప్రాంతీయవాదాన్ని వేర్పాటువాదంతో పోల్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసు పెట్టలేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. కేసు పెట్టడం చేతగాని ప్రభుత్వం తెలంగాణలో ఉందని విమర్శించారు. కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని ప్రాధాన్యత లేని అంశంగా భావిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ప్రజల త్యాగాలను అవమాన పరిచినట్లేనని కవిత అన్నారు. ఇకపోతే మాజీమంత్రి కేటీఆర్‌పై కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత పేర్కొన్నారు.

## శాస్త్రినగర్ 2కోట్ల కేసు ఛేదన

చెన్నై,జూన్18 : నగరంలో శాస్త్రి నగర్ ప్రాంతంలో చోరీకి గురైన రూ.2 కోట్ల కేసును తమిళనాడు పోలీసులు ఛేదించారు. అందుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1.97 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే , మూడు మొబైల్ ఫోన్లతోపాటు కారును స్వాధీనం చేసుకుని.. సీజ్ చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని నగర పోలీసులు వెల్లడించారు.

## ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దగా ప్రోత్సహిస్తున్నాం

### మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

### కృష్ణా జిల్లాలను ఆదర్శంగా దిద్దే పనిలో ఉన్నాం

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్



అమరావతి : ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. పశు సంవర్ధక రంగంలో ఇంటి వద్దకే పశువైద్య సేవలు అందిస్తున్నా మని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పరిశ్రమల రంగంలో కృష్ణా జిల్లా విశేష పురోగతి సాధించిందని చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కృష్ణా జిల్లా అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహకారంతో సంక్షేమం - అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద 1.33 లక్షల రైతు కుటుంబాలకు రూ.252.94 కోట్ల పెట్టుబడి సాయం అందించామని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు 29 కిసాన్ డ్రోన్లను సబ్సిడీపై అందించామన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. విద్యారంగంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, మెగా డీఎస్సీ ద్వారా 1,203 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 1.98 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించామని అన్నారు. ఆరోగ్య రంగంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రతి నెల 2.30 లక్షల మందికి ప్రయోజనం అందుతోందని వెల్లడించారు. మహిళా సాధికారత కోసం డ్వాక్రా, స్త్రీనిధి ద్వారా వేల కోట్ల రుణాలు అందించామని మంత్రి తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. 1.27 లక్షలకుపైగా భూ హక్కు పత్రాలను పంపిణీ చేశామని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో కృష్ణా జిల్లా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పేదలకు గృహ వసతి కల్పించడంలో ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందన్నారు. మచిలీపట్నం పోర్టు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనుందని తెలిపారు. పోర్టు, ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కృష్ణా జిల్లాను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో కృష్ణా జిల్లా అభివృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

### సునీల్ కుమార్ బెయిల్ పిటిషన్ విచారణ

### ఎప్పటిలోగా లొంగిపోతారో చెప్పాలన్న హైకోర్టు

### విచారణ నేటికి వాయిదా వేసిన కోర్టు


అమరావతి,జూన్ 18 : ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ సభ్యుడిపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఐపీఎస్ అధికారికి ముందస్తు బెయిల్ రక్షణగా మారకూడదని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పిటిషనర్‌ను ఉద్దేశించి 'ఎప్పటిలోగా సరెండర్ అవుతారని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు, ఒక పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సంఘటనల్లో పాల్గొనకుండా ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి తనను తాను నియంత్రించుకోవాల్సిన బాధ్యత ఉందని వ్యాఖ్యానించింది. ఎంపీని వేధింపులకు గురిచేయబోతున్నారని సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసునని హైకోర్టు తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆయన స్వచ్ఛందంగా వెళ్లి పోలీసుల ఎదుట సరెండర్ కావడం మంచిదని సూచించింది. ముందస్తు బెయిల్ కోరుతూ కొనసాగాలా, లేక సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకోవాలా అనే విషయంపై నిర్ణయం తీసుకుని కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్‌తో సంప్రదించి తదుపరి నిర్ణయాన్ని హైకోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి కోర్టు ముందు తమ వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోకుండా, కేసు విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తదుపరి విచారణలో సునీల్ కుమార్ నాయక్ తరఫు నిర్ణయం, కోర్టు పరిశీలనలు కీలకంగా మారనున్నాయి.

## 20న అన్నదాత సుఖీభవ నిధులు విడుదు

### కేంద్ర సాయంతో కలిపి రూ.12వేలు జమ

### లింగంగుంట్లలో సీఎం చంద్రబాబు ప్రారంభం

### వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి



అమరావతి,జూన్18 : అన్నదాత సుఖీభవ మొదటి దశ నిధులను ఈనెల 20వ తేదీన విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. 45.5 లక్షల మంది రైతులకు కేంద్ర సాయంతో కలిపి రూ.12వేలు జమ చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్లలో సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవను లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. పొగాకు రైతుల సమస్యలపై మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ఆక్వా, పొగాకు, మామిడి రైతులు నష్టపోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. పొగాకు ధర రూ.200 తగ్గకుండా కొనుగోళ్లు జరగాలని సీఎం ఆదేశించారని పేర్కొన్నారు. తోతాపురి మామిడికి కేజీకి రూ.4 ప్రభుత్వం చెల్లించాలని నిర్ణయించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 28కంపెనీలు పొగాకు బోర్డు వేలంలో పాల్గొనాలని సీఎం ఆదేశించారని అన్నారు. ఇకపై ఆక్వా ఫీడ్ ధరలు పెరగాలంటే కమిటీ ద్వారానే నిర్ణయం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతులు, ఫీడ్ ఉత్పత్తిదారులు, ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పడే కమిటీ ధరలు సమీక్షించి నిర్ణయిస్తుందని వివరించారు. పొగాకు రైతులు గత ఏడాది కంటే ఎక్కువ వర్జీనియా రకం సాగు చేయటంతో ధరలపై ప్రభావం చూపిందని అన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కూడా పొగాకు ధరలు పడిపోయాయని చెప్పుకొచ్చారు. సీఎం చొరవతో 28రకాల పొగాకు కంపెనీలతో చర్చించామని తెలిపారు. పొగాకు బోర్డు వేలంలో కాకుండా దొంగచాటుగా కొనుగోళ్లు జరిపితే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఢిల్లీ కూడా వెళ్లి పొగాకు రైతులు నష్టపోకుండా కేంద్రపెద్దలను కూడా కలుస్తామని వెల్లడించారు. తోతాపురి మామిడి రైతులకు గత ఏడాదిలానే టన్నుకు రూ.4వేలు చెల్లిస్తామని అన్నారు. ఆక్వా రైతులపై ఉద్యమ కార్యాచరణ అనటానికి వైసీపీ నేతలకి సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. సాయికృష్ణ ఘటనను రాజకీయం చేయటం గొడ్డలి పార్టీకే చెల్లిందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని జగన్ కుల, మతాల మధ్య తగాదాలు పెట్టాలని చూస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు బోర్డు వేలంలో అన్ని కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పొగాకు ధరలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. అధిక ఉత్పత్తిని సాకు చూపి ధరలు తగ్గించే చర్యలు చేపట్టడం తగదని అన్నారు. వచ్చే ఏడాది ఎంతమేర పంట వేయాలనేది ముందుగానే చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వ్యాపారస్తులు ఎట్టిపరిస్థితుల్లోనూ రైతుల వద్ద ఉన్న పొగాకుని కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు నష్టపోయే చర్యలను చేపడితే ఉపేక్షించబోమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు.

## ఎపి మద్యం కుంభకోణం కేసు

### మాజీమంత్రి కారుమూరి కుమారుడు సునీల్ అరెస్ట్

హైదరాబాద్,జూన్ 18 : ఏపీలో వైకాపా హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణంలో అరెస్టయిన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కు నాంపల్లి కోర్టు రిమాండ్ విధించింది. 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం సునీల్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అంతకుముందు కోర్టులో ఈడీ, సునీల్ తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. ఈడీ తరఫున పీపీ వాదించారు. వైకాపా ప్రభుత్వంలో సునీల్ తండ్రి నాగేశ్వరరావు పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్నారని పీపీ కోర్టుకు తెలిపారు. తండ్రి పలుకుబడితో సునీల్ మద్యం రవాణా కాంట్రాక్టులు దక్కించుకుని భారీగా లబ్ది పొందినట్లు ఆధారాలను ఈడీ సేకరించిందన్నారు. కుటుంబసభ్యుల మధ్య రూ.7 కోట్ల లావాదేవీలు జరిగినట్లు ఈడీ గుర్తించిందని చెప్పారు. సుదర్శన కన్‌స్ట్రక్షన్‌కు చెందిన సందీప్, ప్రతాప్‌రెడ్డికి మద్యం రవాణా కాంట్రాక్ట్‌లు వచ్చాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

## చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం

### పవన్ ఆదేశాలతో అటవీశాఖ ప్రత్యేక దృష్టి

కాకినాడ,జూన్18 : తునిలో చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోజులు గడుస్తున్నా చిన్నారి జాడ లభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ, ప్రత్యేక హనుమాన్ టీమ్ సంయుక్తంగా థర్మల్ డ్రోన్ల సహాయంతో సెర్చింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. రాత్రి వేళల్లోనూ పాప కోసం విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. థర్మల్ డ్రోన్ల ద్వారా అటవీ జంతువుల కదలికలపైనా అధికారులు నిఘా పెట్టారు. చిన్నారిని అడవి జంతువులు ఎత్తుకెళ్లి ఉండవచ్చన్న అనుమానంతో.. ఆ కోణంలోనూ గాలింపు కొనసాగుతోంది. అటవీ ప్రాంతాల్లో జంతువుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారి జాడను కనిపెట్టడం కోసం పోలీసులు ఇప్పటికే రెండు బొమ్మలను వేలాడదీసి, వాటిలో మాంసం ఎరగా ఉంచారు. ఇప్పటివరకు ఎలాంటి జంతువుల జాడ కానరాకపోవడం గమనార్హం. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది. పాప క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## రాధాగాయత్రి మృతిపై తల్లి అనుమానం

### అల్లుడే హత్య చేసి ఉంటాడని ఆరోపణ

### లోతైన దర్యాప్తు చేస్తే నిజాలు వస్తాయని వెల్లడి


విశాఖపట్నం,జూన్18 : విశాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాధా గాయత్రి మృతి కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. భర్తతో కలిసి ఉత్తరాఖండ్ వెళ్లిన గాయత్రి అనుమానాస్పదస్థితిలో మరణించింది. గాయత్రి మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లి సత్యవతి.. దీనిపై విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తన అల్లుడు శ్రీచరణ్‌పైనే అనుమానం ఉందన్నారు. ఈ కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తే అనేక విషయాలు బయటపడతాయని తల్లి సత్యవతి చెప్పారు. 'నా కూతురి మృతి విషయంలో అల్లుడుపైనే అనుమానం. నా కూతురికి మద్యం సేవించే అలవాటు లేదు. గాయత్రిపై అనుమానంతోనే హత్య చేసి ఉండొచ్చు. రిషికేశ్, హరిద్వార్ వెళ్తున్నామని చివరిసారిగా నాకు చెప్పింది. విహారయాత్ర ముగించుకొని విశాఖకు వస్తానని చెప్పింది. విశాఖకు రాకుండానే నా కూతుర్ని హతమార్చారు. విశాఖకు వచ్చిన తర్వాత రెండు నెలలు వర్క్ ఫ్రం హోం పెట్టి ఇక్కడే ఉంటాను అని చెప్పింది. నా కూతురి విషయంలో మీడియా నాకు న్యాయం చేయాలి. మాది సాంప్రదాయమైన కుటుంబం అని తల్లి సత్యవతి ఆవేదన వ్యక్తం చేసింది.

## యూరియా యాప్ తొలగించాల్సిందే

### బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్,జూన్18 : యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దుకాణాల్లో లేని యూరియా బస్తాలు యాప్ ద్వారా ఎలా రైతులకు అందుతాయని ప్రశ్నించారు. యాప్ వల్ల గ్రామాల్లో రైతులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అందుకే యూరియా యాప్ తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 'యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు.





# అనిల్ రావిపూడి మరో మల్టీస్టారర్ ప్రాజెక్ట్

## వెంకటేశ్, కళ్యాణ్ రామ్ మూవీకి శ్రీకారం

టాలీవుడ్‌లో మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి తెరలేచింది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా తెరకెక్కబోతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు దిగ్గజ దర్శకుడు రాఘవేంద్రరావుతో పాటు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తదితరులు విచ్చేసి క్లాప్ కొట్టారు. ఇక ఈ సినిమాలో నటించబోయే కథానాయికలకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌లో వెంకీ మామకు జోడీగా నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ నటిస్తోండగా.. నందమూరి హీరో కళ్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి సందడి చేయనుంది.


అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా.. సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం వహిస్తున్నాయి. అనిల్ రావిపూడికి బాగా కలిసివచ్చిన సంక్రాంతి సీజన్‌నే ఈ సినిమాకు కూడా లాక్ చేశారు. 2027 సంక్రాంతి కానుకగా ఈ అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దగ్గుబాటి మరియు నందమూరి వంశాల హీరోలు కలిసి నటిస్తుండటంతో, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై అటు అభిమానుల్లో, ఇటు సాధారణ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.





# థియేటర్లలో పెద్ది.. రీలోడెడ్ వర్షన్

## మరో ఆరు నిముషాల అదనపు దృశ్యాలు జోడింపు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న 'పెద్ది' సినిమాకు సంబంధించి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇప్పుడు సరికొత్త 'రీలోడెడ్ వెర్షన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల అదనపు దృశ్యాలను జోడించి నేటి నుంచి థియేటర్లలో ప్రదర్శించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త ఫుటేజ్‌లో కథానాయిక జాన్వీ కపూర్‌కు సంబంధించిన ఎమోషనల్ సీన్స్‌తో పాటు, సీనియర్ నటుడు జగపతి బాబు నటించిన కీలకమైన సన్నివేశం కూడా ఉండటం విశేషం. ఈ అదనపు ఐదున్నర నిమిషాల సీన్స్ సినిమా ఎమోషన్‌ను, డ్రామాను మరో స్థాయికి తీసుకెళ్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే థియేటర్లలో సందడి చేస్తున్న 'పెద్ది'కి ఈ రీలోడెడ్ వెర్షన్ మరింత బూస్ట్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ వంటి పాన్ ఇండియా తారాగణం కీలక పాత్రల్లో మెరిశారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఇప్పటికే మాస్, ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న 'పెద్ది'.. కొత్త సీన్ల జోడింపుతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు బద్దలు కొడుతుందా అనేది ఆసక్తిగా మారింది. థియేటర్లలో 'పెద్ది' రీలోడెడ్ వెర్షన్‌ను మిస్ అవ్వొద్దని చిత్రయూనిట్ మెగా ఫ్యాన్స్‌కు పిలుపునిచ్చింది.



# కోలీవుడ్‌లో దీపావళి ఫైట్

## రజనీకాంత్ జైలర్-2తో ధనుష్ మూవీ పోటీ

కోలీవుడ్‌లో ఈ ఏడాది దీపావళి పండుగకు బాక్సాఫీస్ దగ్గర మరోసారి భారీ వార్‌కు రంగం సిద్ధమవుతోంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఇప్పటికే 90 శాతం షూటింగ్ పూర్తి చేసుకుని చివరి దశకు చేరుకుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్, శాటిలైట్ రైట్స్ కోసం దిగ్గజ ఓటీటీ సంస్థల మధ్య పోటీ నెలకొంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో సందడి చేయనున్నాడు. వచ్చే వారం నుంచి హృతిక్ పార్ట్ షూటింగ్‌ను ప్లాన్ చేశారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 'జైలర్ 2'ను దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది. ఇదిలా ఉంటే నటుడు ధనుష్ కూడా అదే దీపావళి రేసులోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తుండగా, స్టార్ హీరోయిన్లు సాయి పల్లవి, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కూడా దీపావళికే రిలీజ్ చేసే యోచనలో నిర్మాతలు ఉన్నారు. ప్రస్తుతం రెండు టీమ్స్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు, చివరి షెడ్యూల్ షూటింగ్స్‌తో బిజీగా ఉన్నాయి. ఒకవైపు రజనీకాంత్ క్రేజ్, మరోవైపు ధనుష్ కంటెంట్.. దీంతో ఈ దీపావళికి కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. మరి ఈ క్లాష్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి.

### పంద్రాగస్ట్‌కు విడుదల

# కానున్న బట్వారా 1947

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హాజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.






# ఇండియా స్టోరీ పోస్టర్ విడుదల

బాలీవుడ్ నటులు కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సోషియో నేషనల్ డ్రామా 'ది ఇండియా స్టోరీ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్స్ / స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చెత్తన్ డీకే దర్శకత్వం వహిస్తుండగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా ఉన్నారు. దేశంలో తీవ్రమవుతున్న ఆహార కల్తీ, వ్యవసాయంలో రసాయనాలు, పురుగుమందుల మితిమీరిన వాడకం వెనుక ఉన్న కుంభకోణాల చుట్టూ ఈ చిత్ర కథ సాగనుంది. బాంబే హైకోర్టు నేపథ్యంలో గ్రిప్పింగ్ కోర్టు రూమ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో, శ్రేయాస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రి పాత్రలో కనిపించనున్నారు. జీ స్టూడియోస్ ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్న 'ది ఇండియా స్టోరీ' 2026 జూలై 24న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com